Follow: @ANNTELUGU
07-06-2026

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్  సంపుటి- 23  సంచిక- 158  పేజీలు-08  వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI  REGISTERED NUMBER: APTEL/2003/09316  WWW.EPAPER.MAHAADAILY.COM


## సూపర్ సిక్స్ మెప్పించిందా?
# అమరావతిపై గురి కుదిరిందా?

"రాజకీయ రణక్షేత్రంలో.. ప్రజాక్షేత్రమే పరమావధి! అధికార పీఠంపై కూర్చున్నప్పుడు వినిపించే జయజయధ్వానాల వెనుక.. నిగూఢంగా దాగున్న ప్రజా నిస్సందేహాలు, నిశ్శబ్ద ఆక్రందనలను వెలికితీయడమే జర్నలిజం పరమార్థం. ఆంధ్రప్రదేశ్‌లో సంచలన మెజారిటీతో, అఖండ జనాదరణతో కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు పూర్తవుతున్న వేళ.. నాడు ఇచ్చిన 'సూపర్ సిక్స్' నినాదాల హోరు.. నేడు క్షేత్రస్థాయిలో ఏ తీరానికి చేరింది? అటు ఇంద్రకీలాద్రి నుంచి ఇటు చార్మినార్ దాకా.. తెలుగు రాష్ట్రాల పొలిటికల్ ఇమేజ్ ఏ వైపు అడుగులు వేస్తోంది? తెరవెనుక సాగుతున్న వ్యూహాలేంటి? క్షేత్రస్థాయిలో ఓటరు మైండ్ సెట్ ఎలా ఉంది?

04



తెలుగురాష్ట్రాల్లోని తాజా రాజకీయ పరిణామాలపై ఏఎన్ఎన్ - మహా పత్రిక సీఈవో జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్

టాప్ న్యూస్

## వానా వానా వందనం



02

## జంబో కుటుంబం


39 మంది భార్యలు.. | 94మంది పిల్లలు ప్రపంచంలోనే బిగ్గెస్ట్ ఫ్యామిలీ



02

## టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు వీరే

**మహా:** తెలుగు దేశం రాజ్యసభ అభ్యర్థుల పేరును పార్టీ అధినేత చంద్రబాబు ఖరారు చేశారు. భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్, సానా సతీష్ బాబులకు అవకాశం కల్పించారు.





## ఎవరెంత ఏడ్చినా ఆర్ఆర్ఆర్
# ఆగదు

### వద్దు కొనకుంటే.. బండిసంజయ్, కిషన్ రెడ్డిల సంగతి చూస్తాం

- ఈ ప్రాంతానికి కాలుష్యపరిశ్రమలను రానివ్వం
- కారు చెడిపోయి షెడ్డుకు చేరింది.. ఇక పనికిరాదు
- ఏ అభివృద్ధి చేస్తామన్నా రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారు
- కుర్చీ వేసుకుని పాలమూరు కడతానన్నడు.. మందేసుకుని ఫామ్ హౌజ్ లో ఉన్నడు
- కోహెడ్ మార్కెట్ శంఖుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

02

# ఆర్థిక ప్రగతిపై ప్రధాని మోదీ మథనం

- సంక్షోభాల వేళ పటిష్ట వ్యూహాలు
- ఏపీ సభ్యులతో ఉన్నతస్థాయిసమీక్ష
- భౌగోళిక ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణ పరిస్థితుల పై సుదీర్ఘ చర్చలు

02



## మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుకు 14 రోజుల రిమాండ్



02

## కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి




- టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ధ్వజం.
- లిబర్టీ సర్కిల్ వద్ద ఆందోళన

02






# వానా వానా వందనం

**భాగ్యనగరంలో దంచికొట్టింది**
**నేడు ఐదుజిల్లాల్లో జోరు**

**హైదరాబాద్, మహా :** వానా వానా వందనం అనాల్సిన సమయం ఆసన్నమైంది. శనివారం సాయంత్రం భాగ్యనగరంలో వాన దంచికొట్టింది. నగరంలోని అనేకప్రాంతాల్లో వాన కుమ్మేసింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించేందుకు వాతావరణం అనుకూలిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరిక జారీ చేసింది. నల్గొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, నాగర్కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. అలాగే, రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లోనూ పలుచోట్ల ఉరుములు, మెరుపులు మరియు ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్ సహా పరిసర ప్రాంతాల్లో రానున్న 24 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల ఈదురు గాలులతో కూడిన భారీ వర్షపు జల్లులు పడే వీలుందని అంచనా వేశారు.

# జంబో కుటుంబం

**39మంది భార్యలు.. 94మంది పిల్లలు**
**ప్రపంచంలోనే బిగ్గెస్ట్ ఫ్యామిలీ**



**మహా :** చిన్న కుటుంబం.. చింతలేని కుటుంబం అన్న నానుడి ఉన్న కాలంలోనే ఆ మహానుభావుడు ఏకంగా ప్రపంచంలోనే ఎక్కడా లేని పెద్ద కుటుంబం పెట్టేశారు. మళ్ళీ వీరంతా కలిసి సుమారు 200 మంది కలిసి జీవించడం ఆశ్చర్యకరం. ఈశాన్య రాష్ట్రమైన మిజోరంలో ఇది నిజం. 39 మంది భార్యలు, 94 మంది సంతానంతో ప్రపంచంలోనే అతిపెద్ద కుటుంబానికి యజమానిగా గుర్తింపు పొందిన జియోనా చానా 2021లో కన్నుమూసినప్పటికీ, ఆయన వారసత్వం నేటికీ నిరంతరాయంగా కొనసాగుతోంది. ఆ కుటుంబ సభ్యులందరూ ఇప్పటికీ అదే నివాసంలో అత్యంత సమన్వయంతో, ఐకమత్యంతో మెలుగుతున్నారు. మిజోరంలోని బక్తావంగ్ గ్రామంలో ఉన్న 'ఛువాన్ థార్ రన్' అనే నాలుగు అంతస్తుల భారీ భవనమే ఈ కుటుంబానికి నిలయం. సుమారు 100 గదులతో కూడిన ఈ భవంతిలో ఆ కుటుంబం నివసిస్తోంది. 1945లో జన్మించిన జియోనా చానా, బహు భార్యత్వాన్ని ఆచరించే ఒక ప్రత్యేక క్రైస్తవ మత శాఖకు నేతృత్వం వహించారు. తన 17వ ఏట తొలి వివాహం చేసుకున్న ఆయన, జీవితంలో మొత్తం 39 మందిని వివాహమాడారు. ఈ కుటుంబ యొక్క దైనందిన కార్యకలాపాలు ఒక సైనిక పటాలం తరహాలో అత్యంత క్రమశిక్షణతో సాగుతాయి. సభ్యులందరూ బాధ్యతలను సమానంగా పంచుకుంటారు. వీరి వంటశాల సైతం భారీ పరిమాణంలో ఉంటుంది. ఇక్కడ నిత్యం 45 నుంచి 90 కిలోల బియ్యంతో పాటు, భారీ మొత్తంలో కూరగాయలు, పప్పు దినుసులను వండుతారు. జియోనా భార్యలు వంతులవారీగా వంట బాధ్యతలు నిర్వర్తించగా, మిగిలిన వారు వ్యవసాయం, ఇతర వృత్తి పనుల్లో నిమగ్నమవుతారు. జియోనా చానా తన గ్రామంలో వ్యవసాయం, పశుపోషణ, వడ్రంగి వంటి వృత్తులను ప్రోత్సహిస్తూ స్వయం సమృద్ధికి బాటలు వేశారు. ఈ కుటుంబం అనుసరిస్తున్న విశిష్ట జీవన శైలి అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించింది. జియోనా చానా 2021 జూన్ 13న తన 76వ ఏట కన్నుమూశారు. ఆయన భౌతికంగా దూరమైనప్పటికీ, కుటుంబ సభ్యులు నేటికీ అదే ఐక్యతను, క్రమశిక్షణను చాటుతుండడం విశేషం.

## మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుకు
# 14 రోజుల రిమాండ్

**గండిపేట ఫేక్ జీవో కేసు**

**హైదరాబాద్, మహా :** గండిపేట ప్రభుత్వ భూమి కబ్జా కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌లోని వినుకొండ వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడికి ఉప్పరపల్లి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. హైదరాబాద్ శివార్లలోని అత్యంత ఖరీదైన గండిపేట పరిధిలో వెలుగుచూసిన దాదాపు రూ.1500 కోట్ల భారీ భూ కుంభకోణంలో ఆయనను సైబరాబాద్ పోలీసులు తమిళనాడులోని కాంచీపురంలో అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో నార్సింగి, ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి శుక్రవారం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. శనివారం రోడ్డు మార్గం ద్వారా ఆయనను హైదరాబాద్‌కు తరలించి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా.. జూన్ 20వ తేదీ వరకు చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్‌కు ఆదేశించారు.
రంగారెడ్డి జిల్లా గండిపేట సర్వే నంబర్ 18లో ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసేందుకు బ్రహ్మనాయుడు మరికొందరితో కలిసి భారీ కుట్ర పన్నారు. ఈ భూమి తమదేనంటూ గండిపేటకు చెందిన నిమ్మల కుటుంబ సభ్యులు గతంలో కోర్టును ఆశ్రయించగా, అది ప్రభుత్వ పోరంబోకు భూమేనని 2025 అక్టోబర్‌లో హైకోర్టు స్పష్టం చేసింది. కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చినప్పటికీ, ఆ భూమిని ఎలాగైనా సొంతం చేసుకోవాలనే దురుద్దేశంతో నిమ్మల కుటుంబం బ్రహ్మనాయుడుతో ఒప్పందం కుదుర్చుకుంది. ఏకంగా ప్రభుత్వం తమకే ఆ భూమిని కేటాయించినట్లు ఐదు నకిలీ జీవోలు, తప్పుడు రెవెన్యూ రికార్డులను సృష్టించారు. ఈ భారీ కుంభకోణానికి సంబంధించి రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు దర్యాప్తులో తేలింది. ఇందులో నిమ్మల కుటుంబ సభ్యులకు రూ.4 కోట్లు, మధ్యవర్తిగా వ్యవహరించిన రాధాకృష్ణకు రూ.4 కోట్లు, ఇతర వ్యక్తులకు మరో రూ.4 కోట్లు చేతులు మారినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.
ఈ నకిలీ పత్రాల వ్యవహారంపై రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. విషయం తెలిసిన వెంటనే ముందస్తు బెయిల్ కోసం బ్రహ్మనాయుడు హైకోర్టును ఆశ్రయించినప్పటికీ, ప్రాథమిక ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ఆయన బెంగళూరు, కేరళ మీదుగా తమిళనాడుకు పారిపోయి తలదాచుకున్నారు. తమిళనాడులో అరెస్టు అనంతరం ఆయనను నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించగా, పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు, అనుచరులు అక్కడికి చేరుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో కాసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ హై ప్రొఫైల్ కబ్జా కేసులో పోలీసులు ఇప్పటివరకు బ్రహ్మనాయుడితో కలిపి మొత్తం ఆరుగురిని అరెస్ట్ చేశారు.



# ఎవరెంతా ఏడ్చినా ఆర్ఆర్ఆర్ ఆగదు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా** ఎవరెంత ఏడ్చినా, ఎన్ని కుట్రలు పన్నినా ఆర్ఆర్ఆర్, అభివృద్ధి ఆగదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కట్టితీరుతామని, 2034 వరకూ తమదే అధికారమని పునరుద్ఘాటించారు. కారు పూర్తిగా చెడిపోయి కార్ఖానాలో ఉందని, ఎన్ని చేసినా చెడిపోయిన ఆ కారు ఇక పనికిరాదని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కోహెడలో సమీకృత మార్కెట్, ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు నగరానికి సరపడా కాయగూరలు, పాలు రంగారెడ్డి జిల్లా నుంచి వచ్చేవని, ఓఆర్ఆర్, విమానాశ్రయం వచ్చాక ఇక్కడ స్థిరాస్తి వ్యాపారం పెరిగిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఫలితంగా రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయం కుంటుపడిందని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ నిర్మిస్తామని తాను ఎంపీగా ఉన్నప్పుడు హామీ ఇచ్చానన్న రేవంత్ రెడ్డి పండ్లు, కూరగాయలు అన్నీ లభించేలా కోహెడా మార్కెట్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఈ మార్కెట్ మనకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకొస్తుందన్నారు. రైతులు కేవలం వరి, జొన్నలు, పత్తి, మిర్చి పంటలే పండిస్తున్నారని, పరిమితంగా సాగు చేయడం వల్లే కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయన్నారు. కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీని వద్దని, ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తున్నామన్నారు. మహానగరాన్ని నిర్మించి ప్రపంచ వ్యాప్తంగా 500 కంపెనీలు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామన్నారు. తాము అభివృద్ధి చేస్తుంటే, మేం రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని బీఆర్ఎస్ చెబుతోందని రేవంత్ రెడ్డి మండిపడ్డారు.


**ఆదర్శంగా రిజిస్ట్రేషన్ ఆఫీసులు**

రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాగేందుకు నీళ్లు ఉండవు, నిలబడే చోటు లేదని వివరించారు. అలాంటి వాటన్నింటిని దృష్టిలో ఉంచుకునే అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మిస్తున్నామన్నారు. అంతర్జాతీయ సదుపాయాలు కల్పించుకుంటేనే అంతర్జాతీయ నగరం అవుతుందని అభిప్రాయపడ్డారు. వ్యవసాయం దండగ కాదు పండగ అని నిరూపిస్తున్నామని పేర్కొన్నారు. వరి వేస్తే ఉరే అని చెప్పే రోజులు ఇవి కావన్నారు. రైతులకు వరిపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. కాళేశ్వరం కూలేశ్వరం అయినా దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్నామని వివరించారు. రైతులు ఏవిధంగా వడ్లు పండించినా అవి కాళేశ్వరం నీళ్లతోనే అని దుష్ప్రచారం చేశారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కారు ఇప్పుడు పూర్తిగా చెడిపోయి షెడ్డుకు చేరిందని, ఇప్పుడు ఎన్ని రిపేర్లు చేసినా చెడిపోయిన కారు ఇక పనికిరాదని తెలిపారు. మోదీని చూపించి భయపెట్టాలనుకుంటే భయపడమని, తమకు మాటలతో పాటు చేతలు కూడా తెలుసని సీఎం హెచ్చరించారు. ఈనెల 15వ తేదీ తర్వాత వడ్లు కొనకుంటే.. బండి సంజయ్, కిషన్ రెడ్డిల సంగతేంటో చూస్తామన్నారు. మర్యాద తప్పితే ఎవ్వరినీ పొలిమేర కూడా దాటనివ్వమని తీవ్ర హెచ్చరిక చేశారు. చేతకాకపోతే దిగిపో అంటున్నారు.. 12 ఏండ్లయింది మోదీ వడ్లుకొనడా. మోదీని దిగిపొమ్మను.. మా రాహుల్ గాంధీని కూసోబెట్టి ఏం చేయాలో అది చేస్తం. వడ్లు కొంటం.. మెట్రోకు నిధులుతెస్తం అన్నీ చేసుకుంటం అని అన్నారు. గుండు, అరగుండు వ్యాఖ్యలన్నీ చూస్తున్నామని, అల్లాటప్పగా అధికారంలోకి రాలేదన్నారు.

**అష్టదరిద్రులు అడ్డంపడుతున్నరు**

బీఆర్ఎస్ నాయకులు భారత్ ఫ్యూచర్ సిటీ ని రద్దు చేస్తామంటున్నారు, రీజనల్ రింగ్ రోడ్డు, వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్ పోర్టులు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వద్దంటున్నారు. తుమ్మిడిహట్టిని నిర్మించవద్దని అంటున్నారు. అష్టదరిద్రులు ఏ అభివృద్ధి చేస్తామన్నా రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారు. ఇలాగే వ్యవహరిస్తే రాబోయే రోజుల్లో ప్రతిపక్ష హోదా కాదు కాదా.. కారు ను తోయడానికి కూడా ఎవరూ దొరకరు. డిసెంబర్ నుంచే ఫ్రూట్ మార్కెట్ లో కార్యకలాపాలు ప్రారంభం కావాలి. రెండేళ్లలో ఫ్రూట్ మార్కెట్. నిర్మాణం పూర్తి కావాలి. ఫ్రూట్ మార్కెట్ కోసం నిధులను గ్రీన్ ఛానల్ లో ఇస్తాం. కేసీఆర్ కుర్చీ వేసుకుని పాలమూరు రంగారెడ్డి కడతానని అన్నారు.. కాని మందు వేసుకుని ఫామ్ హౌస్ లో కూర్చున్నాడు. అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం కోసం తుమ్మల, శ్రీధర్ బాబు ఇక్కడ కుర్చీ వేసుకుని కూర్చోవాలని సీఎం ఆదేశించారు.
రూ.239 కోట్లతో నిర్మాణం ప్రపంచ స్థాయి నాణ్యతా ప్రమాణాలతో సాంకేతిక హంగులతో కూడిన మార్కెట్ నిర్మాణానికి, ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సీఎం రేవంత్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. కోహెడలో 239 ఎకరాల్లో పండ్ల మార్కెట్‌ను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మొత్తం 3387.35 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో సర్కారు నిర్మిస్తోంది. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఛైర్మన్లు మల్ రెడ్డి రాంరెడ్డి, చిలుక మధుసూధన్ రెడ్డి, చరణ్ కౌశిక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక ప్రగతిపై ప్రధాని మోదీ మథనం



**ఢిల్లీ, మహా :** ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు, పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఆర్థిక సలహా మండలి (ఈఏసీ) సభ్యులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు, వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు అవసరమైన సంస్కరణలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా పశ్చిమాసియా సంక్షోభం భారత్‌తో పాటు ప్రపంచ దేశాలపై చూపే ప్రభావం తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించారు. ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ ) సమావేశం ముగిసిన మరుసటి రోజే ప్రధాని ఈ భేటీ నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అంతర్జాతీయంగా ఎన్ని ప్రతికూలతలు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ అంచనాలకు మించి రాణించడం గమనార్హం. జూన్ 5న విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం 2025 26 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4) లో వాస్తవ స్థూల దేశీయోత్పత్తి (రియల్ జీడీపీ) వృద్ధి రేటు ఏకంగా 7.8 శాతంగా నమోదు కాగా, పూర్తి ఆర్థిక సంవత్సరానికి అది 7.7 శాతంగా రికార్డైంది. స్థిర ధరల ఆధారంగా నాలుగో త్రైమాసికంలో వాస్తవ జీడీపీ రూ.87.77 లక్షల కోట్లుగా అంచనా వేశారు. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.81.40 లక్షల కోట్లతో పోలిస్తే ఇది అత్యుత్తమ ప్రదర్శన. ఇక ప్రస్తుత త్రైమాసికానికి నామినల్ జీడీపీ సైతం రూ.94.65 లక్షల కోట్లుగా అంచనా వేయడం భారత ఆర్థిక వ్యవస్థ దృఢత్వానికి అద్దం పడుతోంది

# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ధ్వజం.**
**లిబర్టీ సర్కిల్ వద్ద ఆందోళన**




**హైదరాబాద్, మహా :** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం తీవ్రస్థాయిలో చెలగాటమాడుతోందని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతగానితనం వల్లే నేడు లక్షలాది మంది విద్యార్థులు రోడ్డున పడే దుస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని లిబర్టీ సర్కిల్ వద్ద ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.
నీట్ యూజీ 2026 పరీక్ష పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో ఏకంగా పరీక్షను రద్దు చేయాల్సి రావడం కేంద్ర ప్రభుత్వ ఘోర వైఫల్యానికి సజీవ నిదర్శనమని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. నెలల తరబడి రాత్రింబవళ్లు కష్టపడి పరీక్షలకు సన్నద్ధమైన విద్యార్థుల శ్రమ.. కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం, ఉదాసీనత కారణంగా బూడిదలో పోసిన పన్నీరైందని మండిపడ్డారు. ఈ పరాభవానికి, నీట్ పరీక్షల నిర్వహణలో వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తీవ్ర మానసిక క్షోభకు గురై, నష్టపోయిన విద్యార్థులకు, వారి కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.దేశ సరిహద్దుల్లోకి చైనా దళాలు చొచ్చుకొస్తున్నా అడ్డుకోలేని కేంద్ర ప్రభుత్వ చేతగానితనం దేశానికి ప్రస్ఫుటంగా కనిపిస్తోందని ఆయన విమర్శించారు. మరోవైపు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఘట్టం పూర్తి కాగానే, సామాన్య ప్రజల నడ్డి విరిచేలా ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరలను అమాంతం పెంచి కేంద్ర ప్రభుత్వం ప్రజలపై పెను భారాన్ని మోపిందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ తీరు పూర్తి నిరాశాజనకంగా ఉంటే.. రాష్ట్రంలో మాత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం ప్రజల ప్రాథమిక అవసరాలైన విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి ఆదర్శంగా నిలుస్తోందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ గెలుపుకు బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్రే అత్యంత కీలకం

**డిసిసి అధ్యక్షుడు, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి**

హన్మకొండ మహా; స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ బి ఎల్ ఎ ల శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ తో పాటు హన్మకొండ జిల్లా డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి , స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిశీలకులు దుద్దిల్ల శ్రీనివాస్, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, ట్రైనర్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి హాజరైయ్యారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక విజయాలకు, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు బూత్ లెవెల్ ఏజెంట్లే అత్యంత కీలకమైన సైనికులని హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి స్పష్టం చేశారు. రఘునాథపల్లి మండలం నిడిగొండ వద్ద గల సత్య సాయి కన్వెన్షన్ నందు శనివారం స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని బూత్ లెవల్ ఏజెంట్స్ ఒక రోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఇనగాల వెంకట్రాంరెడ్డి పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటా చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఓటరు నమోదు, జాబితాల సవరణ ప్రక్రియలో బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉంటూ, ప్రతి ఓటరుకు పార్టీపై నమ్మకం కలిగేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే ట్రైనర్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి బూత్ స్థాయి మెలకువల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.




# కాక్రోచ్‌ల నిరసన గళం

**జంతర్ మంతర్ లో యువతరంగం**

**మహా :** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శనివారం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది యువత, విద్యార్థులు ఆందోళనలో పాల్గొన్నారు. దేశ విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం పెంచాలని, పరీక్షలు, నియామక ప్రక్రియల్లో జరుగుతున్న అక్రమాలకు బాధ్యత వహించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఆందోళనలో పాల్గొన్న పలువురు యువకులు బొద్దింకల మాస్కులు ధరించి, చేతుల్లో పూలతో నిరసన వ్యక్తం చేశారు. కొంతమంది పాఠశాల విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి కార్యక్రమానికి హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధర్నా, ప్రదర్శన చేపట్టేందుకు అనుమతులు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన దరఖాస్తు ముందుగానే అందిందని పోలీసులు వెల్లడించారు. ధర్మేంద్రప్రధాన్ రాజీనామా డిమాండ్ చేస్తూ ఆందోళన శాంతియుతంగా సాగింది.

# ట్రాన్స్‌జెండర్ సమాజ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**హనుమకొండ మహా :** హనుమకొండ జిల్లాలో నివసిస్తున్న ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులకు గుర్తింపు, సంక్షేమ పథకాల అందుబాటు, సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన ట్రాన్స్‌జెండర్ ఐడెంటిటీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అర్హులైన ట్రాన్స్‌జెండర్ సభ్యులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి విశ్వజ, ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఓరుగంటి లైలా, రాష్ట్ర సలహాదారుడు ఇ.వి. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్ సమాజానికి కూడా సమాజంలోని ఇతరుల మాదిరిగానే సమాన హక్కులు, అవకాశాలు లభించాల్సిన అవసరం ఉందన్నారు. వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, విద్య, ఉపాధి, ఆరోగ్య సేవలు సులభంగా చేరేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి సంబంధించిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి జిల్లా పరిపాలన ఎల్లప్పుడూ సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ట్రాన్స్‌జెండర్ గుర్తింపు కార్డులు వారికి అధికారిక గుర్తింపును కల్పించడంతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.
రాష్ట్ర సలహాదారుడు ఇ.వి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ట్రాన్స్‌జెండర్ సమాజ సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ట్రాన్స్‌జెండర్‌లకు విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, సమాన అవకాశాలు లభించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.
అలాగే వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులకు రాజకీయ, సామాజిక రంగాలలో ప్రాధాన్యత కల్పిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కార్యదర్శి పదవి ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఇది ట్రాన్స్‌జెండర్ సమాజానికి మరింత ఆత్మవిశ్వాసాన్ని కల్పించడమే కాకుండా ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేరి సామాజిక సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావడం సంతోషకరమని తెలిపారు.ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఓ. లైలా మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్‌ల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కృతజ్ఞతలు తెలిపారు. గుర్తింపు కార్డుల పంపిణీ ద్వారా కమ్యూనిటీ సభ్యులకు ప్రభుత్వ పథకాల లబ్ధి మరింత సులభంగా అందుతుందని అన్నారు.



## కోహెడలో కొంగొత్త వెలుగులు

- అంతర్జాతీయ పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపన.
- రూ.2,284 కోట్లతో 239 ఎకరాల్లో సమీకృత మార్కెట్ నిర్మాణం.
- రూ.20 కోట్లతో సకల సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం.
- తొమ్మిది నెలల్లోనే కార్యాలయ భవన నిర్మాణ పూర్తికి లక్ష్యం.
- రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచలేదు.. విపక్షాలవి అసత్య ఆరోపణలే.

**అబ్దుల్లాపూర్‌మెట్,మహా :** రాష్ట్ర రాజధాని శివార్లలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొహెడ వద్ద సరికొత్త అభివృద్ధి శకానికి అంకురార్పణ జరిగింది. ఔటర్ రింగు రోడ్డు సమీపంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, అత్యాధునిక హంగులతో నిర్మించనున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్, ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమిపూజ చేశారు. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ళ శ్రీధర్ బాబులతో కలిసి సీఎం ఈ పనులకు లాంఛనంగా శంకుస్థాపన చేశారు. సుమారు 239 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో రూ.2,284 కోట్లకు పైగా భారీ నిధులతో సకల సౌకర్యాలతో అంతర్జాతీయ స్థాయి పండ్ల మార్కెట్‌ను ప్రభుత్వం ఇక్కడ తీర్చిదిద్దనుంది.

*సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నవీకరణ*

ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించే లక్ష్యంతో హైదరాబాద్ పరిధిలోని మొత్తం 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్లుగా విభజించి, అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలను నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగానే కొహెడలో నాలుగు ఎకరాల సువిశాల ప్రాంగణంలో రూ.20 కోట్లతో సుమారు 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనానికి సైతం సీఎం శంకుస్థాపన చేశారు. ఈ అత్యాధునిక కార్యాలయ నిర్మాణాన్ని రాబోయే తొమ్మిది నెలల లోపే శరవేగంగా పూర్తి చేసి, ముఖ్యమంత్రి చేతుల మీదుగానే ప్రారంభోత్సవం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అనంతరం కొహెడలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రితో పాటు ఇతర నేతలు పాల్గొని ప్రసంగించారు.

**రైతులు, భూ యజమానులకే అసలైన లబ్ధి**

రాష్ట్రవ్యాప్తంగా సవరించిన భూ విలువల ప్రకారమే రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభమయ్యాయని నేతలు వేదికపై నుంచి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సామాన్య ప్రజలపై పన్నుల భారం పడకూడదన్న సదుద్దేశంతో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఛార్జీలను ఒక్క రూపాయి కూడా అదనంగా పెంచలేదని గుర్తుచేశారు. కేవలం క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా మార్కెట్ ధరలను (భూ విలువను) మాత్రమే సవరించడం జరిగిందని, దీనిపై ప్రతిపక్ష నాయకులు కావాలనే అవాస్తవాలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం 6 శాతంగా ఉన్న స్టాంప్ డ్యూటీని ఏడున్నర శాతానికి పెంచి ప్రజల నడ్డి విరిచిందని, ఇప్పుడు ఆ పార్టీ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. తాము తీసుకున్న తాజా నిర్ణయం వల్ల ఒకవైపు రాష్ట్రానికి ఆదాయం సమకూరడంతో పాటు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల కోసం భూములు కోల్పోయే రైతులు, నిజమైన భూ యజమానులకు అత్యధిక నష్టపరిహారం లభించి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.

ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డిలతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, మాజీ శాసన సభ్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు, పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కోహెడ పండ్ల మార్కెట్‌కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు : సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపలి ప్రాంతం 1.34 కోట్ల జనాభాతో వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో అంతర్జాతీయ స్థాయి సమీకృత పండ్ల మార్కెట్‌ను నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన ఈ పండ్ల మార్కెట్‌తో పాటు, అత్యాధునిక వసతులతో కూడిన సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు ఏ అవసరం కోసం వచ్చినా అన్నీ ఒకేచోట అందుబాటులో ఉండేలా 240 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో, రూ. 2,300 కోట్ల భారీ వ్యయంతో ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన తరహాలోనే, భవిష్యత్తులో ఈ పండ్ల మార్కెట్‌కు సైతం అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రావడం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రాబోయే రెండేళ్లలో ఈ ప్రాజెక్టును సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామని, నిర్మాణానికి నిధుల కొరత రాకుండా గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే డిసెంబర్ నాటికి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రులకు సూచించారు.

*ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి*

ఒకప్పుడు పండ్లు, కూరగాయల సాగుతో కళకళలాడిన రంగారెడ్డి జిల్లా.. క్రమంగా రియల్ ఎస్టేట్ విస్తరణతో వ్యవసాయంలో వెనుకబడిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కేవలం వరి, మొక్కజొన్న, జొన్న, పత్తి వంటి నాలుగైదు పంటలకే పరిమితం కావడం వల్ల ప్రజల అవసరాలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోందన్నారు. స్థానికంగా సాగు లేకపోవడం వల్లే ఏది కావాలన్నా పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, తద్వారా కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని వివరించారు. ఈ పరిస్థితిని మార్చి ప్రజలందరికీ ప్రయోజనం చేకూర్చేలా రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని ఆయన కోరారు. రంగారెడ్డి జిల్లా అభివృద్ధి చెందితే రాష్ట్రం మొత్తం అభివృద్ధి చెందినట్లేనని, రైతును రాజును చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు.

*అత్యాధునిక వసతులతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు*

రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ. 15 వేల నుంచి రూ. 16 వేల కోట్ల ఆదాయం సమకూరుతున్నప్పటికీ, కార్యాలయాలకు వచ్చే ప్రజలు కూర్చోవడానికి కనీసం కుర్చీ కూడా లేని దుస్థితి నెలకొందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ పరిస్థితిని మార్చే ఉద్దేశంతోనే కోహెడలో మార్కెట్ పక్కనే సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఉన్న 39 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి, అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యంత అధునాతన సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు.

*ఫ్యూచర్ సిటీకి ఫార్చ్యూన్ 500 కంపెనీలు*

భారత్ ఫ్యూచర్ సిటీలో కాలుష్య కారక పరిశ్రమలను ప్రోత్సహించబోమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కాలుష్యంతో ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతింటాయని, అందుకే ఆ ప్రాంతంలో ఒక గొప్ప మహానగరాన్ని నిర్మించి, ప్రపంచంలోనే గుర్తింపు పొందిన ఫార్చ్యూన్ 500 కంపెనీలను తీసుకురావడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. అంతర్జాతీయ నగరమని కేవలం మాటలు చెబితే సరిపోదని, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు అమలు చేసినప్పుడే ఆ గుర్తింపు సాధ్యమవుతుందని అన్నారు. ఇందులో భాగంగానే భారత్ ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల నిర్మాణం, మెట్రో విస్తరణ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.





## గవర్నర్ ఆటలు సాగనివ్వం.

- బీజేపీ జోక్యాన్ని అడ్డుకోవడానికే విజయ్‌కు మద్దతు
- టీవీకే ప్రభుత్వ ఏర్పాటుపై డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు.

**చెన్నై, మహా.** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితిని సృష్టించి రాష్ట్రపతి పాలన విధించాలన్న బీజేపీ కుట్రలను భగ్నం చేసేందుకే నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వానికి తమ మిత్రపక్షాలు మద్దతు ఇచ్చాయని డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని రాష్ట్ర వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలని చూసిన కమలం పార్టీ వ్యూహాలకు చెక్ పెట్టడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన కుండబద్దలు కొట్టారు. శనివారం చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న స్టాలిన్, తాజా రాజకీయ పరిణామాలపై ఈ మేరకు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

**మెజారిటీకి చేరువలో టీవీకే.. వ్యూహాత్మక మద్దతు**

2026 ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 234 స్థానాలకు గాను టీవీకే 108 సీట్లు కైవసం చేసుకుని అసెంబ్లీలో అతిపెద్ద పార్టీగా అవతరించిన విషయం విదితమే. అయితే, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 118కి ఆ పార్టీ పది సీట్ల దూరంలో నిలిచిపోయింది. ఈ క్రమంలో ఎవరూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పరిస్థితి లేకపోవడాన్ని ఆసరాగా తీసుకుని రాష్ట్రపతి పాలన విధించే ప్రమాదం ఉందని భావించిన డీఎంకే.. వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఈ నేపథ్యంలోనే డీఎంకే కూటమిలోని సీపీఐ, సీపీఎం, వీసీకే వంటి పార్టీలతో పాటు, ఎన్నికలకు ముందు కూటమి నుంచి విడిపోయి ఐదు స్థానాలు సాధించిన కాంగ్రెస్ పార్టీ.. విజయ్ ప్రభుత్వానికి అండగా నిలిచాయి. తద్వారా విజయ్ సునాయాసంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగారు.

## చేనేత కార్మికులను విస్మరిస్తే ఊరుకోం ఉద్యమిస్తాం

- చేనేత కార్మికుల తరపున ఆమరణ దీక్షకు సైతం సిద్ధం
- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్
- టెండర్ విధానాన్ని రద్దు చేసి జీవో నెం.1ని అమలు చేయాలి




**మహా వరంగల్ బ్యూరో;** ఉమ్మడి వరంగల్ జిల్లా చేనేత సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతియుత నిరసన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు. చేనేత కార్మికుల సమస్యల పై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం అనాటి చేనేత శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో చేనేత భీమా, నేతన్నకు చేయూత, చేనేత లక్ష్మి, సహకార సంఘాల బలోపేతం, 40 శాతం సబ్సిడీతో నే చేతన్నకు కావాల్సిన ముడీ సరుకులు, చేనేత ఉత్పత్తులను టెస్కో ద్వారానే నేరుగా ప్రభుత్వం కొనుగోళ్లు చేయడంతో పాటు, మార్కెటింగ్ అవకాశాల విస్తరణ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిందని గుర్తు చేశారు. ముఖ్యంగా జీవో నెం.1 ద్వారా ప్రభుత్వ శాఖలు, విద్యా సంస్థలు, ఇతర ప్రభుత్వ అవసరాలకు చేనేత ఉత్పత్తుల కొనుగోలుకు ప్రాధాన్యత కల్పించడం వల్ల వేలాది మంది చేనేత కార్మికులకు ఉపాధి లభించిందన్నారు. కాగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సంక్షేమ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. చేనేత సహకార సంఘాలకు టెస్కో ద్వారా పనులు అప్పగించాల్సిన చోట టెండర్ విధానాన్ని తీసుకురావడం వల్ల మధ్యవర్తులు లాభపడుతుండగా, అసలు చేనేత కార్మికులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్ విధానం కారణంగా సహకార సంఘాల ఉనికి ప్రమాదంలో పడిందని, వేలాది కుటుంబాల జీవనోపాధి సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జీవో నెం.1ని యథావిధిగా కొనసాగించాలని , తద్వారా చేనేత కార్మికులకు గతంలో అమలైన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, మూడి సరుకుల పై సబ్సిడీ అందించాలని, చేనేత సహకార సంఘాలకు న్యాయం చేయాలని నరేందర్ డిమాండ్ చేశారు. అలాగే చేనేత ఉత్పత్తుల సరఫరాలో అమలు చేస్తున్న టెండర్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, సహకార సంఘాలకు ప్రత్యక్షంగా పనులు అప్పగించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే, విడుదల వారిగా నిరసన కార్యక్రమాలు చేపడతామని, అప్పటికి ప్రభుత్వం దిగి రాకపోతే వరంగల్ తూర్పు నియోజకవర్గంలో చేనేత కార్మికుల తరపున ఆమరణ నిరాహార దీక్షకు సైతం సిద్ధంగా ఉన్నానని నన్నపునేని నరేందర్ ప్రకటించారు. చేనేత కార్మికుల హక్కుల సాధన కోసం చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. చేనేత కార్మికుల సంక్షేమం, సహకార సంఘాల పరిరక్షణ, జీఓ నెం.1 అమలు టెండర్ విధానం రద్దు కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ చేనేత కార్మికుల పక్షాన నిలబడి పోరాడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, పద్మశాలి జిల్లా అధ్యక్షులు డాక్టర్ లయన్ ఆడెపు రవీందర్, వడ్నాల నరేందర్, చేనేత కార్మికులు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, సభ్యులు, బిఆర్ ఎస్ ముఖ్య నాయకులు నీలం రాజు కిషోర్, భద్రయ్య, బైరి నరసయ్య, కట్ల స్వామి అజయ్, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## భవిష్యత్తులో బాల పంచాయతీల పాత్ర కీలకం

**సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత**

**మహా వరంగల్ బ్యూరో;** గ్రామ అభివృద్ధి పిల్లల రక్షణలో బాల పంచాయతీలు ముఖ్య భూమిక పోషిస్తాయని వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత అన్నారు.

తెలంగాణ ప్రభుత్వ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా తెలంగాణ స్టేట్ విమెన్ సేఫ్టీ వింగ్ పోలీస్ డిపార్ట్మెంట్ సూచనల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ అండ్ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లాలోని హసన్పర్తి మండలం వంగపాడు గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బాల పంచాయతీ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత హాజరై మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్మెంట్, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాల పంచాయతీ కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని వీటి ముఖ్య ఉద్దేశ్యము పిల్లల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించి పిల్లల చేత వారి సమస్యలను గుర్తించి వాటి పరిష్కార మార్గాలు చూపించుటకు ప్రభుత్వం, ఎన్జీవో సంస్థలు కృషి చేయు విధానం ముఖ్య ఉద్దేశ్యం తో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు .

ఈ బాల పంచాయతీలో ఉన్న సభ్యులు వారి వారి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారాల కొరకు కృషి చేస్తారని తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వం అలాగే ప్రభుత్వాధికారులు పిల్లలు గుర్తించిన ప్రతి సమస్యను పరిష్కరించుటకు తగిన చొరవ చూపాలని తెలిపారు. భవిష్యత్తు కాలంలో గ్రామ అభివృద్ధిలో ఈ బాల పంచాయతీల పాత్ర ఎంతగానో ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా పిల్లల సంరక్షణతో పాటు పాఠశాల మరియు గ్రామ అభివృద్ధిలో బాల పంచాయితీలు ముఖ్య భూమిక పోషిస్తాయని సూచించారు ఈ సందర్భంగా బాల పంచాయతీకి ఎన్నికైన అభినందించడం జరిగింది.

డీసీపీ చేతుల మీదుగా ఎన్నికైన పిల్లలందరికీ బ్యాడ్జీలు ధరింపజేయడం జరిగింది. బాల పంచాయతీ కార్యక్రమాలు నమోదు చేయడానికి ఏర్పాటు చేసిన రిజిస్టరు బుక్లెట్ ఆవిష్కరించడం జరిగింది .




ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ప్రభుత్వ అధికారులు పాఠశాల ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు రానున్న రెండు సంవత్సరాలు కూడా పిల్లలకు తగిన సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన విమెన్ సేఫ్టీ వింగ్ హైదరాబాద్ డీఎస్పి ఎర్నా హాజరై మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పైలట్ ప్రాజెక్టులో భాగంగా బాల పంచాయతీలు ఈ రోజున 8 గ్రామాలలో నిర్వహించడం జరుగుతుందని కాబట్టి పిల్లలు గుర్తించిన ప్రతి సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం దృష్టికి విమెన్ సేఫ్టీ వింగ్ తీసుకువెళ్లి వాటి పరిష్కారం మార్గాలు కనుగొంటామని తెలిపారు రానున్న రోజుల్లో ఈ యొక్క కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించడానికి తగిన ప్రణాళికను రూపొందిస్తున్నామని తెలిపారు .

ఈ కార్యక్రమంలో మై ఛాయిసెస్ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ జన్ను క్రాంతి, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి జాన్ నరసింహులు , సీఐ మహేందర్ ,ఎస్సై రవి, సిడబ్ల్యుసి కమిటీ సభ్యులు దామోదర్, షీ టీమ్ ఎస్సై స్వాతి ,ఎంఈఓ శ్రీనివాస్ , యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎస్సై సుధాకర్ , సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్, షేర్ ఎన్జీవో కోఆర్డినేటర్ శిరీష , చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ భాస్కర్, తదితరులతోపాటు మాజీ కార్పొరేటర్ రవి నాయక్ ,మన ఊరు మనబడి కోఆర్డినేటర్ దోమ కుమార్, పోలీస్ సిబ్బంది ,భాగ్యలక్ష్మి, రామారావు ,శ్రీనివాస్, ఇస్మాయిల్ , కుమారస్వామి , వంశీ, తదితరుల తో పాటు ఎన్జీవో ప్రతినిధులు సుదర్శన్ ,జమున ,జగన్ మరియు అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్లు ద్వాక్రా సంఘాల ప్రతినిధులు గ్రామ ప్రజలు తల్లిదండ్రులు హాజరైయ్యారు.

## నీట్2026 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు
- వీ.సీ లో పాల్గొన్న వరంగల్ హనుమకొండ జిల్లాల కలెక్టర్లు

**మహా వరంగల్ బ్యూరో :** రాష్ట్రంలో నీట్ 2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి అదనపు డి జి పి మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సి.పి.లు, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీట్ 2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, వరి ధాన్యం కొనుగోలు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి సభ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21వ తేదీన జరగనున్న నీట్ 2026 పరీక్షకు 24 పట్టణాలలో 208 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 72 వేల 956 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీ గా బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర, జిల్లా సమన్వయ కమిటీలు అందుకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు




## మహిళల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం

**మహిళలు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి**

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**




**మహా వరంగల్ బ్యూరో;** మహిళ భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు పని చేస్తారని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా రెవిన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో శనివారం ధర్మసాగర్ మండలం పెండ్యాల గ్రామంలో గ్రామ సభను నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో గ్రామస్తులను ఉదేశ్యస్తూ వరంగల్ సీపీ ముందుగా మహిళ భద్రత గురించి మాట్లాడుతూ ప్రతి మహిళ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగిపోవాలని, ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని. మహిళలు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగిపోవాలని, మహిళలు తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే ఆత్మ విశ్వాసం అవసరమని, మహిళల భద్రతకై షీ టీం విభాగం పనిచేస్తుందని. ఎవరైనా వేధింపులకు పాల్పడితే మౌనం వీడి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మహిళలు తమ. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, పిల్లల అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని సీపీ చెప్పారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు బాధ్యాయుతంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించగలమని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ధర్మసాగర్ ఇన్స్ స్పెక్టర్ శ్రీధర్ రావు, స్థానిక సర్పంచ్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

- ప్రతి కేసును బాధ్యతాయుతంగా పరిశీ-లించాలి
- హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లాలో కొనసాగుతున్న సర్వే పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భూ రికార్డులు, భూ కొలతల శాఖ అధికారులు, సర్వేయర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ వివిధ సర్వే పనుల పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వ, పట్టా భూముల హద్దుల నిర్ధారణ, గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించిన సర్వే, రీ సర్వే కార్యక్రమాలు, చెరువుల శిఖం (వెట్‌ల్యాండ్స్) భూముల గుర్తింపు, కొలతలు తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రత్యేకంగా చెరువు శిఖం భూముల సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జానకీపురం, ముచ్చర్ల గ్రామాల్లో కొనసాగుతున్న రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి పెండింగ్ అంశాలను పరిష్కరించాలని ఆదేశించారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో సర్వే కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న కలెక్టర్, ఖచ్చితత్వంతో కూడిన సర్వే నిర్వహణ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చన్నారు. ప్రతి కేసును బాధ్యతాయుతంగా పరిశీలిస్తూ నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో భూ రికార్డులు, భూ కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, డిప్యూటీ ఇన్స్పెక్టర్లు సారంగపాణి, రాజనర్సయ్యతో పాటు జిల్లాలోని 14 మండలాల సర్వేయర్లు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ మెప్పించిందా? అమరావతిపై గురి కుదిరిందా?



"రాజకీయ రణక్షేత్రంలో.. ప్రజాక్షేత్రమే పరమావధి! అధికార పీఠంపై కూర్చున్నప్పుడు వినిపించే జయజయధ్వానాల వెనుక.. నిగూఢంగా దాగున్న ప్రజా నిస్సందేహాలు, నిశ్శబ్ద ఆక్రందనలను వెలికితీయడమే నిజమైన జర్నలిజం పరమార్థం. ఆంధ్రప్రదేశ్‌లో అఖండ జనాదరణతో, సంచలన మెజారిటీతో తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు పూర్తవుతున్న వేళ.. నాడు ఎన్నికల శంఖారావంలో వినిపించిన 'సూపర్ సిక్స్' నినాదాల హోరు.. నేడు క్షేత్రస్థాయిలో ఏ తీరానికి చేరింది?> అటు అమరావతి నిర్మాణ ప్రాంగణం నుంచి.. ఇటు పాలమూరు సాగునీటి కారిడార్ దాకా.. తెలుగు రాష్ట్రాల పొలిటికల్, ఎకనామిక్ ఇమేజ్ ఏ వైపు అడుగులు వేస్తోంది? తెరవెనుక సాగుతున్న వ్యూహాలేంటి? లోకేష్ ఐటీ వేట వెనుక ఉన్న వాస్తవాలెన్ని? రేవంత్ రెడ్డి ఇరిగేషన్ పట్టుదల గేమ్ ఛేంజర్ కాబోతోందా? సగటు ఓటరు మైండ్ సెట్ ఎలా ఉంది?

**ఎఎన్ఎన్ - 'మహాపత్రిక' సీఈవో కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**

రాజకీయాల్లో ఏ ప్రభుత్వానికైనా ప్రారంభంలో ఉండే 'హనీమూన్ పీరియడ్' ముగిసింది. అధికారం అప్పగించిన ప్రజలు ఇప్పుడు క్షేత్రస్థాయిలో ఫలితాలను, తమ నిత్య జీవితంలో వచ్చిన మార్పులను లెక్కేసుకుంటున్నారు. కూటమి శ్రేణులు, పొలిటికల్ సర్కిల్స్, పారిశ్రామిక వర్గాలు ప్రభుత్వ నిర్ణయాలపై హ్యాపీగా ఉన్నాయి. గత ఐదేళ్ల నాటి అనిశ్చితి, భయాందోళనలు తొలగిపోయి, రాష్ట్రంలో మళ్లీ వ్యాపార, వాణిజ్య రంగాలు ఊపిరి పీల్చుకున్నాయన్న తృప్తి స్పష్టంగా కనిపిస్తోంది. పరిపాలనలో పారదర్శకత తేవడానికి, పాత బ్యూరోక్రాటిక్ అడ్డంకులను తొలగించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు మేధావులను మెప్పిస్తున్నాయి. సామాన్య ఓటరు మాత్రం ఇంకా ఒక స్థిరమైన హ్యాపీ మూడ్‌లోకి రాలేకపోతున్నాడు. నిత్యావసర వస్తువుల ధరల మంట, కరెంట్ ఛార్జీల సర్దుబాటు భారాలు, స్థానిక మున్సిపల్, గ్రామ స్థాయి సమస్యల పరిష్కారంలో జరుగుతున్న ఆలస్యం సగటు మధ్యతరగతి జీవిని ఇబ్బంది పెడుతున్నాయి. "పరిపాలన మారింది సరే.. మా జేబుల్లో మార్పు ఎప్పుడు వస్తుంది?" అన్న ప్రశ్న సామాన్యుడి నుంచి వినిపిస్తోంది.



కూటమి మార్క్ సంక్షేమానికి 'సూపర్ సిక్స్' ఒక దిక్సూచి. దీని అమలు తీరుపై ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. పట్టికలు, లెక్కల ఆర్భాటాలు పక్కన పెట్టి క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలను పరిశీలిస్తే ఈ ఆరు పథకాల అసలు రంగు స్పష్టమవుతుంది. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పథకం చూస్తే వృద్ధాప్య పింఛన్లను రూ.4,000 కు పెంచే ప్రక్రియ 100% సక్సెస్ అయింది. వాలంటీర్ల వ్యవస్థ లేకపోయినా.. ప్రతి నెల ఒకటో తేదీనే సచివాలయ సిబ్బంది నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయడం పెద్ద సానుకూలతగా మారింది. ఇక దీపం 2.0 (ఉచిత సిలిండర్లు) పథకానికి వస్తే ఏడాదికి 3 ఉచిత వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. మధ్యతరగతి, పేద మహిళలకు ఇది ఆర్థికంగా కొంత ఊరటనిచ్చింది. స్త్రీ శక్తి (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం కాగా, ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య 60% కు పైగా పెరిగింది. తల్లికి వందనం పథకం ద్వారా బడికి వెళ్లే ప్రతి బిడ్డకూ (గతంలో లాగా కుటుంబంలో ఒక్కరికే కాకుండా) ఏడాదికి రూ.15,000 అందిస్తామన్న హామీతో విద్యాసంవత్సరం ప్రారంభంలోనే లబ్ధి చేకూర్చే ప్రక్రియను పట్టాలెక్కించారు. అన్నదాత సుఖీభవ పథకం కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ నిధులతో కలిపి రైతులకు ఏడాదికి రూ.20,000 పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం విడతల వారీగా అడుగులు వేస్తోంది. ఖజానా ఖాళీగా ఉండటంతో బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు పడ్డాయని, ల్యాండ్ రికార్డుల వెరిఫికేషన్ వల్ల కౌలు రైతులకు ఈ పెట్టుబడి సాయం సకాలంలో అందడం లేదనేది క్షేత్రస్థాయిలో ఉన్న అసలు సమస్య. అన్నింటికంటే ముఖ్యంగా, నెలకు రూ.3,000 ఇచ్చే నిరుద్యోగ భృతి' గైడ్‌లైన్స్ ఇంకా గడప దాటకపోవడం, 'ఆడబిడ్డ నిధి' (నెలకు రూ.1,500) ఊసే ఎత్తకపోవడంపై నిరుద్యోగులు, మహిళా ఓటర్లలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. బడ్జెట్ అడ్డంకుల వల్లే కూటమి సర్కారు కొన్ని పథకాలను హోల్డ్‌లో పెట్టిందని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు ప్రజల్లోకి వెళ్తున్నాయి.

గత ఐదేళ్ల 'మూడు రాజధానుల' నాటి లీగల్ మరియు పొలిటికల్ అనిశ్చితికి పూర్తిగా తెరదించుతూ, కూటమి ప్రభుత్వం అమరావతిని ఏకైక పరిపాలనా రాజధానిగా ప్రకటించి పనులు ప్రారంభించింది. దాదాపు రూ.57,821 కోట్ల విలువైన ప్రాజెక్టుల బడ్జెట్ అంచనాలతో అమరావతిలో పనులు 24/7 పద్ధతిలో కదులుతున్నాయి. సీడ్ యాక్సెస్ రోడ్డు, ఆర్టీరియల్ రోడ్లు, ఐకానిక్ సెక్రటేరియట్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణ ప్రాంగణాల్లో దాదాపు 20,000 మంది సిబ్బంది రాత్రింబగళ్లు శ్రమిస్తున్నారు. నెదర్లాండ్స్ నిపుణుల సలహాలతో కొండవీటి వాగు, పాలవాగుల వరద నివారణ పనులను అంతర్జాతీయ ప్రమాణాలతో డిజైన్ చేస్తుండటంతో, అమరావతి సేఫ్ సిటీ అనే నమ్మకం ఇన్వెస్టర్లలో కుదిరింది. సేకరించిన 35,057 ఎకరాలలో.. ఇప్పటికే 34,563 మంది రైతులకు ప్లాట్ల కేటాయింపు పూర్తయింది. కానీ, అసలైన సమస్య జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఉండవల్లి, పెనుమాక, నిడమర్రు గ్రామాల్లో తలెత్తింది. ఇవి మూడు పంటలు పండే అత్యంత సారవంతమైన భూములు కావడం వల్ల ఇక్కడి రైతులు ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. ప్రభుత్వం ఇక్కడ 'ల్యాండ్ అక్విజిషన్' నోటిఫికేషన్లు ఇవ్వడంతో రైతులు నిరసనల బాట పట్టారు. ఈ రైతులకు ప్రతిపక్ష వైసీపీ పూర్తి లీగల్ సపోర్ట్ ఇస్తామని ప్రకటించడం, ప్రత్యేక లీగల్ ప్యానెల్ పెట్టడం ఇప్పుడు అమరావతి పొలిటికల్ బెల్ట్‌లో కొత్త టెన్షన్‌ను క్రియేట్ చేస్తోంది.

ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల శాఖల మంత్రిగా నారా లోకేష్ అనుసరిస్తున్న వ్యూహాలు ఏపీ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేలా ఉన్నాయి. గతంలో ఉన్న బ్యూరోక్రాటిక్ రెడ్‌టేపిజం స్థానంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మంత్రాన్ని ఆయన అమలు చేస్తున్నారు. గూగుల్

సంస్థ రూ.1,20,000 కోట్ల భారీ పెట్టుబడితో అమెరికా వెలుపల తన అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తోంది. అదానీకనెక్స్, ఎయిర్‌టెల్ భాగస్వామ్యంతో వచ్చే దాదాపు 1.8 లక్షల ఉద్యోగాల సృష్టి జరగబోతోంది. దీనికి తోడు సిఫై టెక్నాలజీస్ రూ.1,500 కోట్లతో ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌ను నిర్మిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన డేటా సెంటర్ ఐటీ పాలసీల వల్ల గ్లోబల్ బ్రాండ్స్ వైజాగ్ వైపు క్యూ కడుతున్నాయి. నిర్మాణంలో ఉన్న భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ కూడా తోడైతే, రాబోయే రోజుల్లో విశాఖపట్నం ఐటీ మరియు ఏఐ రంగాల్లో హైదరాబాద్, బెంగళూరు నగరాలకు గట్టి పోటీ ఇవ్వడం ఖాయం. అయితే, ఈ ఒప్పందాలన్నీ సకాలంలో గ్రౌండ్ అయి, స్థానిక ఆంధ్రప్రదేశ్ యువతకు ఐటీ ఉద్యోగాలు దక్కినప్పుడే లోకేష్ కష్టానికి సంపూర్ణ ఫలితం లభించినట్లవుతుంది.

ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు చుట్టూ ఉన్న సాంకేతిక, ఆర్థిక అడ్డంకులు చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ అనుభవానికి ఒక అతిపెద్ద పరీక్ష. గత ప్రభుత్వ హయాంలో సంభవించిన వరదల వల్ల డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడం, గైడ్ బండ్ కుంగుబాటు వంటి తీవ్ర సాంకేతిక లోపాలు ప్రాజెక్టును పెద్ద చిక్కుల్లో పడేశాయి. అంతర్జాతీయ నిపుణుల సూచనల ప్రకారం కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం చేపట్టడం ఇంజనీరింగ్ పరంగా పెద్ద సవాల్. కేంద్రంలో కూటమి ప్రభుత్వం ఉండటాన్ని చంద్రబాబు అనుకూలంగా మార్చుకున్నారు. ఢిల్లీ పర్యటనల ద్వారా పోలవరం సవరించిన అంచనాల కు కేంద్రం నుంచి ప్రత్యేక గ్రాంట్లు, నిధులు సాధించడంలో బాబు సక్సెస్ అయ్యారు. కానీ, కేవలం నిధులు వస్తే సరిపోదు.. వరద సీజన్‌ను తట్టుకుంటూ పనులు వేగవంతం చేయడం మరియు సర్వం కోల్పోయిన వేలాది మంది గిరిజన నిర్వాసితులకు పునరావాసం పారదర్శకంగా అందించడమే బాబు అనుభవానికి ఉన్న అసలైన ల్యాండ్ మార్క్. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 4, 5 తేదీల్లో తన సొంత గడ్డ అయిన ఉమ్మడి మహబూబ్‌నగర్ (పాలమూరు) జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై జరిపిన రెండు రోజుల సుడిగాలి పర్యటన పక్కా అడ్మినిస్ట్రేటివ్ అండ్ పొలిటికల్ గేమ్ ఛేంజర్. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి రంగంపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినా పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పెండింగ్‌లో పెట్టిందని రేవంత్ ప్రశ్నించారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, భూసేకరణ ఆలస్యాన్ని అధిగమించడానికి కలెక్టర్లకు 'వార్‌ఫుటింగ్' ఆదేశాలు ఇచ్చారు. ప్రతి ఆరు నెలలకూ నిర్దిష్టమైన టార్గెట్లు ఫిక్స్ చేశారు. జూన్ 2027 నాటికి ఉదండాపూర్ వరకు, ఆ తర్వాత ఆరు నెలల్లో లక్ష్మీదేవిపల్లి వరకు పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పూర్తి చేస్తామన్న సీఎం డెడ్‌లైన్ గనుక నిజమైతే.. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో దాదాపు 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇది వలసల పాలమూరును శాశ్వతంగా కోనసీమలా మార్చే అతి పెద్ద గేమ్ ఛేంజర్ కాబోతోంది. దక్షిణ తెలంగాణలో బీఆర్ఎస్ కోటను బద్దలు కొట్టడానికి కాంగ్రెస్‌కు ఇది ఒక పవర్ ఫుల్ పొలిటికల్ వెపన్.

అధికార పక్షాల ప్రగతి రథాలు.. ప్రతిపక్షాల విమర్శల బాణాలు.. వీటి మధ్య నలిగిపోయేది ఎప్పుడూ సామాన్య ప్రజానీకమే. కూటమి ప్రభుత్వం సంక్షేమం, పెట్టుబడుల వేటలో వేస్తున్న అడుగులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ఏపీ ము□చిత్రాన్ని మార్చాలి.. అలాగే రేవంత్ రెడ్డి మార్క్ ఇరిగేషన్ పట్టుదల తెలంగాణ రైతాంగం కళ్లల్లో ఆనందం నింపాలి.

# 'సమ' తుల్యం ఎక్కడ...?


**పచ్చని చెట్లు... చల్లటి గాలి...గల, గల పారే సెలయేరు.పక్షుల. కిల, కిల రావాలు .... ఆహ్లాద పరిచే వాతావరణం...వీటిని అనుభవించే అవకాశం... ఒక్కసారి ఊహించుకుంటేనే మనసు ఆనందంతో పరవశించి పోతుంది... ఎందుకంటే ఇప్పుడు ఇవి మనకు దూరంగా వెళ్లిపోయాయి... పోలేదు... పోయేలా మనమే చేసుకున్నాం...సహజ సిద్ధ మైన ప్రకృతి అందాలను మన చేతులతో మనమే నెట్టి వేస్తున్నాం.**



. ఫలితంగా పర్యావరణ పరిరక్షణ ఇప్పుడు ఓ సవాల్‌గా మారింది... మనిషిలోని స్వార్థం జీవరాశి మనుగడనే ప్రశ్నార్థకం చేస్తోంది... చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, చివరికి నదులు, సముద్రాలు కలుషితం అయి విషతుల్యంగా మారిపోతున్నాయి... అడవులు అంతరించి వన్య ప్రాణుల మనుగడకే పెద్ద సమస్య తెచ్చి పెడుతోంది... దింతో వన్య ప్రాణులు జనవాసాల మధ్యకు వచ్చేస్తున్నాయి...ఎక్కడో అడవుల్లో తిరగ వల్సిన పులులు, ఎలుగుబంట్లు ఏకంగా ఇళ్ల మధ్యకే వచ్చేస్తున్నాయి... పెరిగిన ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం మనిషిని ఓ యంత్రంలా మార్చేసింది... ఆలోచన తగ్గింది... అవసరం పెరిగింది... ఇదే ఇప్పుడు పర్యావరణ సమతుల్యంను నిర్లక్ష్యం చేసే పరిస్థితికి తీసుకొని వచ్చింది... ఇప్పుడు అంతా హైటెక్... అన్నీ నిమిషాల్లో జరిగి పోవాలి... ఇప్పుడు సమయం తో పోటీ పడేలా జీవన శైలీ మారుపోయింది.... మొత్తం ప్లాస్టిక్ యుగంగా మారిపోయింది... తినే ప్లేట్ మొదలుకుని ప్రతీదీ ప్లాస్టిక్... ప్లాస్టిక్... ప్లాస్టిక్... ఈ పరిస్థితి చూస్తే ఇది టెక్ యుగం అనే కన్నా ప్లాస్టిక్ యుగం అంటే అద్దినట్లు సరి పోతుంది.

ప్రతీ ఏడాది అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినం జరుపుకోవటం పరిపాటే... ఈ సమయంలో మాత్రమే చెట్లు, చెరువులు, వాగులు, వంకలు, నదులు, సముద్రాలు, అడవులు గుర్తుకు వస్తాయి. వెంటనే పలుగు, పార పట్టుకుని ఓ పది మొక్కలు నాటేసి హడావిడి చేస్తాం... పర్యావరణ పరిరక్షణ కోసం కట్టుబడి ఉంటాం అంటూ భీష్మ ప్రతినలు ఇందులో ఓ భాగం... ఇక అంతే సంగతులు...నాటిన మొక్కలు ఏమైనా ఎవ్వరికి పట్టదు... అడవులు నరికే వారు, వన్య ప్రాణులను వేటాడే వారు, చెరువులు, వాగులు, వంకలు పూడ్చి నిర్మాణాలు చేసే వారు... ఇలా ఎవరి పనిలో వారు బిజీగా గడిపేస్తూ మొత్తం వాతావరణం విషమయం అయ్యేలా చేస్తూనే వున్నారు...గత మూడు దశాబ్దాలలో మన దేశంలో 23 శాతం అడవులు కబ్జాలకు గురి అయ్యాయి...దేశవ్యాప్తంగా దాదాపుగా మూడు లక్షల చెరువులు మాయం అయి అక్కడ నివాసాలు ఏర్పడ్డాయి. వాగులు, వంకలు, కుంటల కబ్జాల లెక్కలు అధికారులకే అంతు పట్టట్లేదు... ఇక నదీ జలాలు కూడా కలుషితం అవుతూనే వున్నాయి... ఇది ఇక్కడితో ఆగలేదు.... ఏకంగా సముద్ర జలాల కలుషితం వరకు పాకింది... ఇదే ఇప్పుడు పర్యావరణ సమాతుల్యం దెబ్బ తీసి అతివృష్టి, అనావృష్టిలకు, ప్రకృతి వైపరీత్యాలకు కారణం అవుతోందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పర్యావరణాన్ని దెబ్బ తీసే అంశాలలో మొదటిది అడవుల తరుగుదల... పచ్చని చెట్లు తగ్గిపోవటం... ఒక్క మర్రి చెట్టు ఆయువు అయిదు వందల సంవత్సరాల వరకు ఉంటుంది... ఇక వేప, రావి చెట్లు ఆయువు వంద నుంచి 175 సంవత్సరాల వరకు ఉంటుందని నిపుణులు అంటున్నారు... ఇవే కాదు... అడవుల్లో పర్యావరణ పరిరక్షణకు, వన్య ప్రాణులు జీవనానికి ఉపయోగపడే లక్షల కొద్దీ వృక్ష జాతి ఉందని నిపుణులు అంటున్నారు... ఇవి ప్రకృతి ప్రసాదించి వరంగా వారు చెప్పుకు వస్తున్నారు... ఇక ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించి వున్న నల్లమల అడవులు కూడా ప్రకృతి ఇచ్చిన వన సంపద... చిరుతలు, పెద్ద పులులతో పాటు అనేక వన్య ప్రాణులకు ఇది ఆవాసం... ఇలాంటి నల్లమల అడవులు కూడా ఇప్పుడు కబ్జాల బారిన పడుతున్నాయి... పల్లెలు వదిలి ఉపాధి కోసం ప్రజలు పట్టణాలు, నగరాలకు వలస వస్తున్నారు... దింతో జానవాసాలు పెరిగి పోతున్నాయి... చెరువులు, కుంటలు, కాలువల స్థానంలో బహుళ అంతస్థులు పెరిగిపోతున్నాయి... ఫలితంగా అంతా కాంక్రీట్ జంగిల్ గా మారిపోయి వాతావరణం మారిపోతోంది... ఇక పరిశ్రమలు పెరిగి ఆ కాలుష్యం ప్రజలను ఉక్కిరి, బిక్కిరి చేస్తూనే వుంది... ఇక నగరాల్లో పెరిగి పోతున్న వాహనాలతో ఇది తారాస్థాయికి చేరింది... తెలంగాణలోని హైదరాబాద్ వంటి నగరాల్లో రోజుకు రెండు వందల నుంచి మూడు వందల కొత్త వాహనాలు రోడ్డు పైకి వస్తున్నట్లు అంచనా... మున్ముందు వీటి సంఖ్య ఇంకా పెరిగే పరిస్థితి వుంది... ఇక ప్లాస్టిక్ వాడకంకు హద్దే లేదు.. ఒక్క ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్ పూర్తిగా భూగర్భంలో కలవాలి అంటే కనీసం 20 నుంచి 30 సంవత్సరాల సమయం పడుతుందనే నమ్మలేని నిజం ప్లాస్టిక్ వాడే వారికి తెలియనిది కాదు... అయినా అదే పోకడ... అదే నిర్లక్ష్యం... వెరసి భూ తాపం... అకాల వర్షాలు... భూ ప్రకంపనలు... తుపాన్లు... ఆకస్మికంగా వచ్చే వరదలు.

ముప్పు చుట్టుముట్టినప్పుడు గగ్గోలు పెట్టటం, పాలకులు సహాయక చర్యలు అంటూ హంగామా చేయటం... ఇది మనకు అలవాటుగా మారి పోయింది... ఇప్పటికే పర్యావరణ పరిరక్షణపై తగిన శ్రద్ద తీసుకోవటంలో చాలా ఆలస్యం అయింది.... ఇంకా ఇదే నిర్లక్ష్యం వహిస్తే పెను ముప్పు తప్పదు అంటున్న నిపుణుల హెచ్చరిక ఎప్పటికి మనకు అర్థం అవుతోందో... పర్యావరణ పరిరక్షణ కోసం ఒక్క రోజు కార్యక్రమాలు చేసి చేతులు దులుపుకుంటే ఫలితం శూన్యం... దీన్ని ఓ ఉద్యమంలా చేపట్టాలి... ఇందులో అందరు భాగస్వామ్యం కావాలి... మాటలు కాదు... ఇప్పుడు చేతలు కావాలి... అదే జీవరాసులకు ప్రాణ వాయువు అవుతుందన్న నిజం ఇప్పటికి అయినా గుర్తించాలి.



**జి. వెంకటరమణ**
**సీనియర్ జర్నలిస్ట్.**

# ముప్పేట దాడి వ్యూహాత్మకమే

**ప్రొఫెసర్ నాగేశ్వర్ వర్సెస్ పవన్ కళ్యాణ్‌గా ప్రారంభమైన చర్చ తెలంగాణ రాజకీయాల్లో పెద్ద దుమారం రేపుతోంది. ఇది అనుకోకుండా తెరపైకి వచ్చిందా లేక వ్యూహాత్మకంగా ప్రారంభమైందా తెలియదు కానీ.. తెలంగాణ ఎవరి జాగిరు అన్న ప్రశ్న ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఓ ట్రెండింగ్ టాపిక్ గా మారింది. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ టార్గెట్‌గా తెలంగాణ నేతలంతా విరుచుకుపడుతున్నారు. అయితే ఈ మాటల దాడిలో తెలంగాణ కాంగ్రెస్ అందరి కన్నా ముందుంది. తెలంగాణ అంశాన్ని సొంతం చేసుకునే బీఆర్ఎస్ పార్టీ ఈ విషయంలో కాస్త వెనుకబడినట్టుగా కనిపిస్తుంది. ఈ వివాదం కేవలం పవన్ కళ్యాణ్ సమావేశానికి అనుమతి నిరాకరణ, ఆ తర్వాత వచ్చిన మాటల యుద్ధం మాత్రమేనా? లేక దీని వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంది పుచ్చుకున్న రాజకీయ వ్యూహమా? తాజా పరిణామాలను పరిశీలిస్తే రెండో వాదనకే ఎక్కువ బలం కనిపిస్తోంది.**



తెలంగాణ రాష్ట్ర అవతరణ రోజు హైదరాబాద్‌లో పవన్ కళ్యాణ్ నిర్వహించాలనుకున్న నవ నిర్మాణ దీక్ష కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించడం, దానిపై పవన్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించడం, వెంటనే కాంగ్రెస్ నేతలు ఎదురుదాడికి దిగడం వరుస ఘటనలు మాత్రమే కాదు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ రాజకీయాల దృష్ట్యా ఇవి ఒక ప్రణాళికాబద్ధమైన రాజకీయ వ్యూహంలో భాగమనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గాంధీభవన్‌లో కూర్చుని పవన్ కళ్యాణ్‌ను "పెయిడ్ ఆర్టిస్ట్" అంటూ విమర్శించారు. తెలంగాణ మా అబ్బ జాగీరే అంటూ జనసేన కార్యకర్తలను మరింత రెచ్చగొట్టారు. మందుల సామేలు, అనిరుధ్ రెడ్డి, అద్దంకి దయాకర్ లాంటి కాంగ్రెస్ నేతలు పలువురు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌ను హైదరాబాద్ రాజకీయాలపై జోక్యం చేసుకోవద్దని హెచ్చరించడం యాదృచ్ఛిక పరిణామాలుగా కనిపించడం లేదు. అధికార పార్టీలో ఇలాంటి వ్యాఖ్యలు సాధారణంగా సీఎం స్థాయి నాయకుల దృష్టిలో లేకుండా బయటకు రావు. అందుకే ఈ విమర్శల వెనుక రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహం ఉందనే అభిప్రాయం బలపడుతోంది.

దీనికి సమాధానం హైదరాబాద్ రాజకీయ సమీకరణాల్లో కనిపిస్తుంది. త్వరలో జరగనున్న హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పోరేషన్ల ఎన్నికలు కాంగ్రెస్‌కు అత్యంత కీలకం. గత కొన్నేళ్లుగా బీజేపీ నగరంలో బలపడుతోంది. మరోవైపు టీడీపీకి సంప్రదాయ ఆంధ్ర ఓటు బ్యాంక్ ఇంకా పూర్తిగా చెదరిపోలేదు. ఈ పరిస్థితిలో పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన, బీజేపీ, టీడీపీలు కలిసి ఒక రాజకీయ వేదికపైకి వస్తే అది కాంగ్రెస్‌కు పెద్ద సవాల్‌గా మారే అవకాశం ఉంది. పవన్ కళ్యాణ్ వ్యక్తిగతంగా తెలంగాణలో భారీ ఓటు బ్యాంక్ కలిగి ఉండకపోయినా, ఆయనకు ఆంధ్ర మూలాలున్న నగర ఓటర్లలో ప్రభావం ఉంది. ముఖ్యంగా యువత, మధ్యతరగతి వర్గాల్లో ఆయనకు ఉన్న ఆకర్షణ బీజేపీకి అదనపు బలం అనడంలో ఏ మాత్రం సందేహించాల్సిన అవసరం లేదు. ఈ కారణంగానే ఆ కూటమి బలపడక ముందే పవన్‌ను రాజకీయంగా డిఫెన్సివ్‌లోకి నెట్టే ప్రయత్నం జరుగుతోందనే వాదన వినిపిస్తోంది.

ఇక్కడ రేవంత్ రెడ్డి వ్యూహం మరింత ఆసక్తికరంగా కనిపిస్తుంది. ఒకవైపు ఆయన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ వంటి కార్యక్రమాల ద్వారా ఆంధ్ర మూలాలున్న ఓటర్లకు సానుకూల సంకేతాలు పంపుతున్నారు. తన టీడీపీ నేపథ్యాన్ని కూడా ఆ వర్గంలో సానుభూతిగా మలుచుకుంటున్నారు. మరోవైపు కాంగ్రెస్‌లోని తెలంగాణ ఉద్యమ భావజాలం కలిగిన నాయకుల ద్వారా కోర్ తెలంగాణ భావోద్వేగాన్ని సజీవంగా ఉంచే ప్రయత్నమూ చేస్తున్నారు. అంటే ఒకే సమయంలో రెండు భిన్న వర్గాల ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం జరుగుతోంది. ఆంధ్ర ఓటర్లను పూర్తిగా దూరం చేసుకోకుండా, తెలంగాణ అస్తిత్వ రాజకీయాలను కూడా వదులుకోకుండా ముందుకు వెళ్లాలనేది ఈ వ్యూహం సారాంశంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో మరో కీలక అంశం బీఆర్ఎస్. తెలంగాణ ఉద్యమం తర్వాత ప్రాంతీయ అస్తిత్వ రాజకీయాలపై దాదాపు గుత్తాధిపత్యం బీఆర్ఎస్‌కే ఉంది. కానీ ఇప్పుడు అదే అంశాలపై కాంగ్రెస్ కూడా మాట్లాడటం ప్రారంభించింది. ఫలితంగా బీఆర్ఎస్‌కు చెందిన సంప్రదాయ తెలంగాణ ఓటు బ్యాంక్‌లో చీలికలు తెచ్చే అవకాశం ఏర్పడుతోంది.

రాజకీయంగా చూస్తే రేవంత్ రెడ్డి ఒకేసారి మూడు లక్ష్యాలను గురిపెడుతున్నట్లు కనిపిస్తోంది. మొదటిది బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి ఏర్పడే అవకాశాలను బలహీనపరచడం. రెండోది బీఆర్ఎస్‌కు ఉన్న తెలంగాణ భావోద్వేగ రాజకీయ ఆధిపత్యాన్ని సవాల్ చేయడం. మూడోది హైదరాబాద్‌లోని విభిన్న ఓటు వర్గాలను కాంగ్రెస్ వైపు నిలబెట్టడం. అందుకే పవన్ కళ్యాణ్‌పై జరుగుతున్న ఈ రాజకీయ దాడిని కేవలం వ్యక్తిగత విమర్శలుగా చూడడం కంటే, రాబోయే ట్రై కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన పెద్ద రాజకీయ వ్యూహంలో భాగంగా చూడాల్సిన అవసరం ఉంది. ఈ వ్యూహం ఎంతవరకు ఫలిస్తుంది? పవన్ కళ్యాణ్ దీనికి ఎలా ప్రతిస్పందిస్తారు? బీజేపీటీడీపీజనసేన సమీకరణాలు ఏ దిశగా వెళ్తాయి? అన్నదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది. చివరగా ఈ వ్యూహంలో బలయ్యేది బీజేపీయేనా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. ఎందుకంటే తానెంటో తన సత్తా ఏంటో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో చూపించాలనుకుంటున్న బీజేపీకి ఈ అనూహ్య పరిణామం కొంత ఇబ్బదకరంగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు.



**జి. కృష్ణమూర్తి**
**అసోసియేట్ ఎడిటర్**



## కాకర్ల లో మాస్టర్ ఈకే హోమియో వైద్య శిబిరం

**ఉచితంగా మందులు పంపిణీ**

**జూలూరుపాడు, మహా:** మండల పరిధి కాకర్ల గ్రామంలో మాస్టర్ ఈకే శతాబ్ది సందర్భంగా మాస్టర్ ఈకే ఆధ్యాత్మిక సేవా సంస్థ కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య సేవ శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో గ్రామంలోని దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సుమారు 130 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి హోమియో మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ మందులను రోగులకు వ్యాధి పూర్తిగా తగ్గేవరకు ఉచితంగా పంపిణీ చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా హోమియో డాక్టర్స్ జి రాధాకృష్ణమూర్తి, టీ రవికాంత్ లు మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో, మారిన ఆహారపు అలవాట్లు అనేక రకాల ఆరోగ్య సమస్యలకు ప్రధాన కారణం అన్నారు. దానితోపాటు ఆరోగ్య సమస్యల నివారణకు మనం వాడుతున్న ఇంగ్లీష్ మందుల వలన ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. కాబట్టి మన ఆహారపు అలవాట్లు మార్చుకోవడంతోపాటు ఇంగ్లీష్ మందుల వాడకాన్ని తగ్గించి హోమియో మందులు వాడడం వలన ఆరోగ్యంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు దరిచేరే అవకాశం ఉండదని తెలిపారు. కావున ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారైనా నిర్భయంగా హోమియో మందులను వాడుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాదరేంద్రబాబు, కే శ్రీనివాసరెడ్డి, పిఎస్ఎస్ మూర్తి, పి శ్రీధరరావు, టీ ధనలక్ష్మి, కోటేశ్వరరావు, కరుణ, వీరమల్లు, సిహెచ్ శ్రీమన్నారాయణ, గ్రామస్తులు రాచబంటి వెంకటనరసయ్య, కళ్యాణం వెంకటప్పయ్య, గోగుల వెంకటేశ్వర్లు, సున్నం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా ప్రజలకు అందించాలి

- డిప్యూటీ కమిషనర్, పంచాయతీరాజ్ రూరల్ ఎంప్లాయ్మెంట్ శాఖ అధికారి విద్యాలత



**జూలూరుపాడు, మహా:** మండలంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రభుత్వ కార్యక్రమము అనుసరించి 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మండల పరిధి కాకర్ల గ్రామంలోని రైతు వేదికలో శనివారం గ్రామ సభను ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలకు వివిధ శాఖల ప్రగతి నివేదికల వివరణ, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ గ్రామ సభలకు జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. గ్రామసభలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామస్థుల బాధ్యతలు, ప్రజా భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు.ప్రత్యేకంగా ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ అంశాలపై జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగలక్ష్మి ప్రత్యేక వీడియో ప్రదర్శించి ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. అనంతరం గ్రామ ప్రజలందరితో స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత గ్రామాల నిర్మాణానికి సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ కమిషనర్ విద్యాలత మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థలో వివిధ శాఖల సమన్వయం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం అన్ని శాఖల కార్యక్రమాల సమన్వయ బాధ్యతను నిర్వహిస్తున్నందున, మండల స్థాయి అధికారులు పరస్పర సహకారంతో పనిచేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా అందించాలని సూచించారు. గ్రామ సభల ద్వారా ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన పెంపొందించడంతో పాటు, గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బానోతు బుల్లి, డిప్యూటీ కమిషనర్, పంచాయతీరాజ్, రూరల్ ఎంప్లాయ్‌మెంట్ శాఖ అధికారి విద్యాలత, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగలక్ష్మి, ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి అప్పారావు, డివిజనల్ పంచాయతీ అధికారి ప్రభాకర్, ఏపీడి విజయభాస్కర్ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాళ్లూరి రవి, మండల విద్యాశాఖ అధికారి జుంకీలాల్, ఎంపీఓ తులసీరామ్, కాకర్ల మాజీ ఎంపీటీసీ పొన్నగంటి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ధరల పెరుగుదలకు నిరసనగా..

**జూన్ 10న కలెక్టరేట్ ముట్టడి: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్**

**కుషాయిగూడ, మహా** :నిత్యావసర వస్తువులు, వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్, విద్యుత్ చార్జీలు, విద్యా-వైద్య ఖర్చులు నిరంతరం పెరుగుతూ ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెడుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్. బోస్ విమర్శించారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జూన్ 10న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో విడుదల చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు తోటపల్లి శంకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వి.ఎస్. బోస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరించి కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తున్నాయని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు, ఇంధన ధరలు, గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ధరల నియంత్రణలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు.సీపీఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలను అదుపులోకి తేవాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.



## సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి బ్యూరో, మహా:**ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రధాన లక్ష్యం అని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రామ సభకు జిల్లా కలెక్టర్ అంకిత్ హాజరై ప్రసంగించారు.

గ్రామ సభలు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరవేసే సమర్థవంతమైన వేదికలని అన్నారు. విద్య వైద్యం గ్రామీణాభివృద్ధి పర్యావరణ పరిరక్షణ పారిశుద్ధ్యం వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంట మార్పిడి విధానాలను అనుసరించాలని వ్యవసాయ శాఖ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. ఎరువులు పురుగు మందుల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పంటల దిగుబడులు పెరిగేలా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాలోత్ భారతి, ఎంపీడీఓ జి.సుస్మిత, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేస్తున్న మోడీ ప్రభుత్వం

స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలి ఏఐయుకేఎస్ రాష్ట్ర నాయకులు బానోతు ధర్మ

జూలూరుపాడు, మహా:రైతులకు మద్దతు ధర కల్పిస్తామని చెప్పి అధికారంలోకొచ్చిన మోడీ ప్రభుత్వం, 12 ఏళ్లు గడిచిన గిట్టుబాటు ధర కల్పించకుండా రైతులను మోసం చేస్తున్నారని అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర నాయకులు బానోతు ధర్మ అన్నారు. శనివారం రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు జాటోత్ కృష్ణ, బానోతు ధర్మ లు మాట్లాడుతూ 12 సంవత్సరాల క్రితం అధికారంలోకి రాకపూర్వం స్వామినాథన్ కమిటీ సిఫారసులను అనుసరించి సమగ్ర వ్యవసాయ ఉత్పత్తి ఖర్చుల ప్రాతిపదికన కనీస మద్దతు ధరలను నిర్ణయిస్తామని కేంద్ర ప్రభుత్వం వాగ్దానం చేసిందని గుర్తు చేశారు. దేశ రైతాంగం యావత్తు రోడ్డుపైకెక్కి ఆందోళనకు పూనుకున్నా కేంద్ర ప్రభుత్వం మౌనం వహిస్తూ చోద్యం చూస్తుందని మండిపడ్డారు. విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగుమందులు, కూలీల వేతనాలు, డీజిల్, విద్యుత్తు, సాగునీరు మొదలైన ఉత్పత్తి ధరలు ఆకాశానికి అంటుతున్నా వీటిని పరిగణలోకి తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వరి, మొక్కజొన్న, పత్తి, కంది లాంటి పంటలకు ఏ సీజన్లో కూడా కొనుగోలు కేంద్రాలను సకాలంలో తెరిచిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా రైతు సమస్యలు పరిష్కారం చేసే విధంగా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఐక్య రైతు సంఘం నేతలు లింగాల వీరభద్రం, జాటోత్ నారసింహ, పైదా వెంకటేశ్వర్లు, తాటి నరసింహారావు, తెల్లం కృష్ణయ్య, మలకం సతీష్, బానోతు లాలు, భూక్యా శకురు, బాధాత్ బోజ్జా, కోటియా, పి పద్మావతి, నాగ విజయలక్ష్మి, రామనాథం, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.






## ప్రజల శ్రేయోభిలాషిగా ఆదివాసి నాయకుడు మెండి భాస్కర్

**వేపలగడ్డ గ్రామసభలో ప్రజా సమస్యలపై గళమెత్తిన ఆదివాసి నాయకుడు**

**బూర్గంపహాడ్, మహా :**వేపలగడ్డ గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలో గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రస్తావిస్తూ ఆదివాసి నాయకుడు మెండి భాస్కర్ మాట్లాడారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన సమస్యల పరిష్కారంపై ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ఈ సందర్భంగా గ్రామంలో ప్రధాన సమస్యలుగా ఉన్న బీటీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్య సమస్యలు, పంట పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహ నిర్మాణ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా ప్రతినిధులు గ్రామ సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.అలాగే ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుపై కూడా ఆయన స్పందించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా కింద రూ.15 వేల ఆర్థిక సహాయం, ఆసరా పెన్షన్ రూ.4 వేల వరకు పెంపు, మహాలక్ష్మి పథకం కింద రూ.2500 సహాయం, రైతులకు సరైన గిట్టుబాటు ధరలు కల్పించడం, ధాన్యం కొనుగోలు వంటి అంశాల్లో హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రకటించే పథకాలు కేవలం హామీలకే పరిమితం కాకుండా ప్రజలకు చేరేలా కృషి చేయాలని కోరారు. గ్రామస్థుల సమస్యల పరిష్కారానికి ప్రజా పాలన గ్రామసభలు వేదిక కావాలని అభిప్రాయపడ్డారు. గ్రామసభలో పాల్గొన్న గ్రామస్థులు కూడా తమ సమస్యలను వివరించి త్వరితగతిన పరిష్కారం చేయాలని అధికారులను కోరారు.



## ఐఎఫ్టీయూ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

**బూర్గంపహాడ్, మహా**: జూన్ 10న ఇల్లందులో నిర్వహించనున్న ఐఎఫ్టీయూ రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరుతూ సారపాక సెంటర్‌లో విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వచారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, మహిళలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని శిక్షణ తరగతుల ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గ సమస్యలు, హక్కుల పరిరక్షణ, సామాజిక - రాజకీయ అంశాలపై అవగాహన పెంపొందించేందుకు రాజకీయ శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్మికులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సంఘటిత కార్మిక ఉద్యమాల బలోపేతం, కార్మిక హక్కుల సాధన, సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంపొందించుకోవడానికి ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు కీలకమని నాయకులు వివరించారు.ఈ ప్రచార కార్యక్రమంలో ఐఎఫ్టీయూ పాల్వంచ-బూర్గంపాడు ఏరియా అధ్యక్షుడు వైఎస్ రెడ్డి, ఏరియా కమిటీ నాయకులు బట్టు రవి, బట్టు లక్ష్మణ్, మహిళా కార్మికులు లక్ష్మి, సునీత, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.రాజకీయ శిక్షణ తరగతుల్లో కార్మికులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవ ర్యాలీ

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**ప్రపంచ పర్యావరణ దినోత్సవంను పురస్కరించుకొని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కొత్తగూడెం శాఖ ఆధ్వర్యంలో శనివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగరేణి మహిళా జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది. అనంతరం ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా వ్యాస రచన వక్తృత్వ క్విజ్ పోటీలు నిర్వహించగా విజేతలుగా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేయడం జరిగింది. పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించి ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో జూనియర్ కళాశాల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినీలతో కలిసి ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ పర్యావరణ సహాయ ఇంజనీర్ అజయ్ కుమార్, సింగరేణి కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ విభాగం జనరల్ మేనేజర్ బి.సైదులు, సి.హెచ్. శ్రీనివాస్(ఎస్ఓఎం), పి.రవి కిరణ్(అడిషనల్ మేనేజర్), మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శారద, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, సింగరేణి ఉన్నత పాఠశాల పర్యావరణ సమన్వయకర్త వనిత, ఇతర అధికారులు, సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ ఎత్తివేతే లక్ష్యంగా పోరాటం



**కుషాయిగూడ, మహా :** పంచభూతాలను కలుషితం చేస్తున్న డంపింగ్ యార్డ్ ఎత్తివేతే లక్ష్యంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని, డంపింగ్ యార్డ్ బాధిత ప్రాంతాల్లో 100 పడకల ఆసుపత్రిని నిర్మించాలని జవహర్ నగర్ లో రోడ్లు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ స్పష్టం చేసింది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ బాలాజీ నగర్ లోని దళిత సంక్షేమ భవన్లో, వివిధ రాజకీయ పార్టీలు మీడియా మిత్రులు ప్రజాసంఘాల నేతలు శనివారం సమావేశమై డంపింగ్ యార్డ్ సమస్యపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇఫ్టు జాతీయ కార్యదర్శి షేక్షావలి, మల్లేష్ ఐఎఫ్టియు, శివ బాబు టి యు సి ఐ ప్రవీణ్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ జవహర్ నగర్ లో గాలి నీరు భూమి వాయువులు మొత్తం కలుషితమయ్యాయని, ప్రజలు ఇకనైనా మేలుకోకుంటే జవహర్ నగర్ మరో హిరోషిమా నాగసాకి నగరంలాగా తయారయ్యి పర్యావరణ సమతుల్యత దెబ్బతిని మానవ మనుగడకే ప్రమాదం పొంచి ఉందన్నారు. సమస్త జీవకోటికి జీవనాధారం నీరు వాయువు, గాలి, తదితర పంచభూతాలు డంపింగ్ యార్డ్ వల్ల కలుషితమై పోతున్నాయని వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. జవహర్ నగర్ ప్రాంతంలో చాలా బస్తీల్లో డ్రైనేజీ మంచినీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జవహర్ నగర్ వాసులతోపాటు డంపింగ్ యార్డ్ బాధితుల ఆరోగ్యం కొరకు వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. లేనియెడల డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సంసిద్ధులు అవుతామని తెలిపారు. అనంతరం డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీని ఏర్పాటు చేశారు. పోరాట కమిటీ చైర్మన్గా ఇఫ్టు షేక్షావలి, కన్వీనర్ గా ఉమా మహేష్, గౌరవ సలహాదారులుగా మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, ఉప సర్పంచ్ రావల్కోల్ నరసింహ గౌడ్, కల్లేపల్లి సదానందం, తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ ఎంపీటీసీ తోటపల్లి శంకర్, సిపిఎం శివన్నారాయణ, బి.ఎస్.పి ఏక స్వామి, మాజీ మేయర్ మేకల కావ్య, బిఆర్ఎస్ అధ్యక్షుడు కొండల ముదిరాజ్, మాజీ కార్పొరేటర్లు ఆలూరి రాజశేఖర్, తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, మేకలలిత యాదవ్, ఆంజనేయులు, అనురాధ, జయసుధ, వై. మల్లేష్, పాషామియా, జయ, అల్లూరి సావిత్రి, జాన్, చంద్రమౌళి, పెరక సునీత, స్వరూప, లక్ష్మి, సామాజిక సేవకుడు బూడిద వెంకటేష్, ప్రతాప్, యాదగిరి, రాణి, శంకర్, లక్ష్మణ్, నరసింహ, నర్సింగరావు, సుబ్రహ్మణ్యం, పాత్రికేయులు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ప్రభుత్వ స్థలంలో ఆట స్థలం, గ్రామ అవసరాల కోసం ఐటీసీ సహకారం

**సారపాక ప్రజల ఎన్నో ఏళ్ల ఆకాంక్ష నెరవేరే దిశగా కీలక అడుగు**



**బూర్గంపహాడ్, మహా :** సారపాక గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఆట స్థలం మరియు గ్రామ అవసరాల కోసం ప్రభుత్వ భూమి వినియోగం అంశంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సారపాక నేషనల్ హైవే సమీపంలో ఉన్న సుమారు 16 ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామపంచాయతీ అవసరాల కోసం ఉపయోగించే విధంగా సహకారం అందించేందుకు ఐటీసీ యాజమాన్యం ముందుకు రావడం గ్రామ ప్రజల్లో ఆనందాన్ని కలిగించింది.ఈ నేపథ్యంలో సంబంధిత ప్రాంతాన్ని సారపాక గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఐటీసీ అధికారులు కలిసి పరిశీలించారు. ఈ స్థలాన్ని ప్రధానంగా గ్రామ యువతకు ఆట స్థలం ఏర్పాటు చేయడంతో పాటు, గ్రామ అభివృద్ధికి అవసరమైన ఇతర మౌలిక సదుపాయాల కోసం వినియోగించుకునే అవకాశాలపై చర్చించారు.గ్రామ ప్రజలు, యువత ఎంతోకాలంగా కోరుకుంటున్న ఆట స్థలం ఏర్పాటుతో పాటు గ్రామ అవసరాలకు అనుగుణంగా ఈ స్థలాన్ని అభివృద్ధి చేయాలని పాలకవర్గ సభ్యులు కోరారు. త్వరలోనే ఈ పనులకు శ్రీకారం చుట్టాలని ఐటీసీ యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా ఐటీసీ సంస్థ సహకారం అందించేందుకు ముందుకు రావడంపై గ్రామపంచాయతీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఐటీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వ స్థలాలను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుతాయని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో సారపాక సర్పంచ్ కిషోర్ నాయక్, మాజీ ఎంపీటీసీ బాలి శ్రీహరి, లాడ్డ, ఏసుబు, మల్లి కృష్ణ, సారపాక గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఐటీసీ డీజీఎం చెంగల్ రావు, సివిల్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

## పీఎం శ్రీవిద్య కేంద్రాలు రద్దు చేయాలి

**కుషాయిగూడ, మహా :** ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్య కేంద్రాలను వెంటనే రద్దు చేసి అంగన్‌వాడీ కేంద్రాలకే అప్పగించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు జి.సునీత డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా డీడబ్ల్యూఓకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన విద్యా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను బలహీనపరిచే చర్యలు చేపడుతోందని ఆరోపించారు. ప్రీ ప్రైమరీ పాఠశాలలు, పీఎం శ్రీవిద్య కేంద్రాలను ప్రత్యేకంగా నిర్వహించడం వల్ల అంగన్‌వాడీల ప్రాధాన్యం తగ్గే ప్రమాదం ఉందన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీవిద్య కేంద్రాలను అంగన్‌వాడీలకే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు నష్టం కలిగిస్తున్న 4,131 పీఎం శ్రీవిద్య కేంద్రాలను వెంటనే రద్దు చేయాలని కోరారు.

కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



# సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : జిల్లా కలెక్టర్

**సంక్షేమ హాస్టల్స్ సమస్యలపై వినతి పత్రం అందజేసిన టిఎన్జీవోస్**

**ఖమ్మం, జూన్ 05:** జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత మరియు సౌకర్యాల కల్పన విషయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ & మేజిస్ట్రేట్ శ్రీ దివాకర టిఎస్ సూచించారు.తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ (TNGOs Union) ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో, జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు నాయకత్వంలో జిల్లా కలెక్టర్ ని కలిసి సంక్షేమ హాస్టళ్లకు సంబంధించిన పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా వినతిపత్రంలోని అంశాలను శ్రద్ధగా విన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలని, హాస్టళ్లలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు.అలాగే, విద్యార్థులతో ఎలాంటి పనులు చేయించరాదని, హాస్టళ్లలో ఫుడ్ పాయిజనింగ్ వంటి ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

టీఎన్జీవోస్ ప్రతినిధులు 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి హాస్టళ్లలో మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ మరియు ప్లంబింగ్ సిబ్బంది ఏర్పాటు, నిత్యావసర సరుకుల సరఫరా, కామన్ మెనూ అమలు, సపోర్ట్ స్టాఫ్ నియామకం, కళాశాల హాస్టల్ వాచ్‌మెన్‌ల పెండింగ్ వేతనాల విడుదల, విద్యార్థులకు వైద్య సేవల విస్తరణ, సివిల్ సప్లైస్ బియ్యం మరియు ఉచిత వస్తువులను నేరుగా హాస్టల్ పాయింట్లకు చేర్చడం తదితర అంశాలను జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకువచ్చారు.వినతిపత్రంలోని అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి, సాధ్యమైనంత త్వరగా తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం మరియు హాస్టల్ పరిపాలన బలోపేతం కోసం తాము కూడా పూర్తి బాధ్యతతో పనిచేస్తూ విద్యార్థుల శ్రేయస్సుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి కొనిదెన శ్రీనివాస్, కోశాధికారి వల్లపు వెంకన్న, హాస్టల్ వెల్ఫేర్ ఫోరం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు, జిల్లా కార్యదర్శి యన్. నాగేశ్వరరావు, జిల్లాలోని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసుకుందాం

- మౌలిక సదుపాయాల కల్పనకు పాలకవర్గం నిరంతరం కృషిచేయాలి
- సిబ్బంది కొరతను తీర్చేవిధంగా నియమాకాలు చేపట్టండి
- సమిష్టి నిర్ణయాలతో సమస్యలు లేని కార్పొరేషన్‌గా నగరాన్ని తీర్చిదిద్దుదాం
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



**భద్రాద్రి బ్యూరో, మహా:** ప్రణాళికాబద్ధంగా కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసుకోవాలని ప్రతి డివిజన్‌లోనూ ప్రజల అవసరాలను గుర్తించి ముందుకు సాగాలని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ కౌన్సిల్ సమావేశం మేయర్ మూడ్ గణేష్ అధ్యక్షతన శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశానికి కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నగర పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ప్రధానంగా ఎండకాలం దృష్ట్యా త్రాగునీటి సమస్య పరిస్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య తీవ్రంగా వున్నచోట ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలనీ ప్రజల కనీస మౌలిక సదుపాయాల కల్పనకు పాలకవర్గం నిరంతరం కృషి చేయాలనీ సూచించారు. నీటి పథకంకు సంబంధించిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పనులు పూర్తయితే కార్పొరేషన్లో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిస్కారం లభిస్తుందన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్లో సిబ్బంది కొరత వేధిస్తోందని త్వరలోనే ఉన్నతాధికారులతో మాట్లాడి అదనపు సిబ్బందిని పెంచేలా చూస్తామన్నారు. విద్యుత్ పారిశుధ్యం అంతర్గత రోడ్లు మురుగు కాలువల డ్రైన్లు తదితర దీర్ఘకాలిక సమస్యల పరిస్కారంపై తాము ఇప్పటికే ప్రేత్యేక ద్రుష్టి సారించామని స్పష్టం చేశారు. ఎలాంటి సమస్యలు లేని ఆదర్శ కార్పొరేషన్ గా కొత్తగూడెం కార్పొరేషన్ ను తీర్చిద్దేందుకు అందరం కలిసికట్టుగా శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కార్పొరేషన్ అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి వున్నానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.



# లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి జూన్ 6 మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పుట్టిన రోజు సందర్భంగా శనివారం ఉదయం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికి, దర్శనం ప్రత్యేక పూజలు అనంతరం ప్రత్యేక ఆశీర్వచనం నిర్వహించి స్వామివారి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.. ఆయన వెంట సతీమణి బీర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ బీర్ల అనిత తో పాటు కాంగ్రెస్ నాయకులు చిర్ర శ్రీశైలం, గుండ్లపల్లి భరత్ గౌడ్ తదితరులు ఉన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఆశీస్సులు తీసుకున్న బీర్ల ఐలయ్య

**యాదాద్రి భువనగిరి జూన్ 6 మహా :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, తెలంగాణ రాష్ట్ర రోడ్లు & భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ఆలేరు నియోజకవర్గ ప్రగతి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై పలు విషయాలు చర్చించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బీర్ల ఐలయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు మరింత సేవ చేసేలా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అలాగే ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న బీర్ల అయిలయ్య గారి సేవలను ఈ సందర్భంగా అభినందించారు. ఆలేరు నియోజకవర్గ ప్రజలు బీర్ల అయిలయ్య గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు

# ప్రజా పాలన గ్రామసభలు

**వలిగొండ జూన్ 6 మహా న్యూస్**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా శనివారం అధికారులు దాసిరెడ్డి గూడెం నాతాలగూడెం వలిగొండ గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు ప్రజా సమస్యలు ప్రభుత్వ చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో జలంధర్ రెడ్డి తహసిల్దార్ దశరథ ఎం పి ఓ వై ప్రేమలత సర్పంచులు వెంకట్ పాపిరెడ్డి గోపి అధికారులు ఏవో అంజనీ దేవి హౌసింగ్ ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు



# భీమలింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణం

**భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి**

**యాదాద్రి భువనగిరి జూన్ 6 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం గ్రామ సమీపంలోని భీమలింగంను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శనివారం సందర్శించారు. భీమలింగేశ్వ ర స్వామి దేవాలయం నిర్మాణం కోసం ఇప్పటికే 2 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని, దేవాలయం నిర్మాణం, సమీపంలో బ్రిడ్జి నిర్మాణం 50 కోట్లు ఆ ప్రాంతం అభివృద్ధి చేసుకోవటానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్ని విధాలుగా సహకరిస్తా అని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి వెల్లడించారు. భీమలింగేశ్వర స్వామి ఆలయం నిర్మాణం కోసం అధికారులు ప్రణాళికాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మూసి ప్రక్షాళన చేసి , ఆలయ నిర్మాణం కూడా పూర్తి చేస్తామని, అన్నారు. ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చి దిద్దుతామని అంతకు మునుపు స్థానిక నాయకులు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి ఘన స్వాగతం పలికారు. భీమలింగం కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టూ ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో R&B, ఇరిగేషన్, రెవెన్యూ, అధికారులు,ఆర్కిటెక్ట్ మరియు ఇతర సిబ్బంది, మండల నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు..



# భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డికి తీవ్ర అస్వస్థత

**యాదాద్రి భువనగిరి జూన్ 6 మహా :** భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్యం కారణంగా గత 20 రోజుల నుండి నిమ్స్ దవాఖానలో డైరెక్టర్ డా.బీరప్ప పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న కొమ్మిడి నర్సింహారెడ్డిని శుక్రవారం మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా తీవ్ర అనారోగ్యానికి గురి అయ్యారు. నర్సింహారెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందనే విషయం తెలుసుకున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కొమ్మిడి నర్సింహారెడ్డిని పరామర్శించి నిమ్స్ డాక్టర్లతో పాటు కుటుంబ సభ్యులతో చర్చించారు.



# పోచంపల్లి చేనేతలకు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉంది

**పోచంపల్లి థ్రెడ్ ఎగ్జిబిషన్ సందర్శించిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**

యాదాద్రి భువనగిరి జూన్ 6 మహా పోచంపల్లి చేనేత కళ కు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని భారీ నీటి పారుదల, సివిల్ సప్లై మంతి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రెండవ రోజు శనివారం హైటెక్స్ లో ఏర్పాటు చేసిన థ్రెడ్ పోచంపల్లి చేనేత ఎగ్జిబిషన్ కు మంత్రి విచ్చేసి ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్ ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ పోచంపల్లి చేనేత కళా వైభవాన్ని ప్రపంచానికి మరింత చేరువ చేసే లక్ష్యంతో హైదరాబాద్లోని హైటెక్స్లో జూన్ 7 వరకు నిర్వహిస్తున్నారని మంత్రి అన్నారు. చేనేత కార్మికుల అపూర్వ నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు వారికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ...... మాదాపూర్ హైటెక్స్ లో "పోచంపల్లి Thread " ఎగ్జిబిషన్ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హాల్ లోని స్టాల్స్ అన్నింటిని ఆయన సందర్శించి , వర్తకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ " పోచంపల్లి వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి ఉందన్నారు. తాను ఎంపీగా ఉన్న కాలంలో పోచంపల్లి శాలువలను ఢిల్లీలో సహచర ఎంపీలు , కేంద్ర మంత్రులకు కప్పి భూదాన్ పోచంపల్లి వస్త్రాల గొప్పతనాన్ని వివరించే వాడినని ఆయన తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశానని ఈ సందర్భంగా వివరించారు. చేనేత వస్త్రాలను ధరించి , మన సాంస్కృతి , సంప్రదాయన్నీ కాపాడుకోవాలని ఆయన తెలిపారు. హైటెక్స్ లో జరిగే వస్త్ర ప్రదర్శన కార్యక్రమాన్ని సందర్శిచి, నాణ్యత కలిగిన వస్త్రాలను కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జగన్నాథం, జిల్లా చేనేత అధికారి శ్రీనివాస్, లోసంబధిత అధికారులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ గద్దెను నిర్మిస్తుండగా అడ్డుకున్న పోలీసులు

- ఆందోళనకు దిగిన కార్యకర్తలు

**కుషాయిగూడ పోలీస్ స్టేషన్ లో ఆందోళన**

**కుషాయిగూడ, మహా:** ఈసీఐఎల్ లో టీఆర్ఎస్ గద్ద జెండాను అడ్డుకున్న పోలీసులు పోలీసులు టిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈసీఐఎల్ క్రాస్ రోడ్ లో టీఆర్ఎస్ గద్దెను ఏర్పాటు చేయుటకై టీఆర్ఎస్ కార్యకర్తలు నిర్మిస్తుండగా కుషాయిగూడ పోలీసులు అడ్డువడంతో టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కుషాయిగూడ పోలీస్ స్టేషన్లో ఆందోళనకు దిగారు టిఆర్ఎస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆవిర్భవించిందని జెండాను అడ్డుకోవడం టిఆర్ఎస్ పార్టీని ఎదిగనివ్వకుండా కుట్రలు చేస్తున్నారంటూ కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఎదుట వందలాది మంది కార్యకర్తలు ఆందోళనకు దిగారు టిఆర్ఎస్ జండాను అటుకోవడంపై కార్యకర్తలు పోలీసుల తీరుపై మండిపడ్డారు ఆందోళన అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి పార్టీ పెట్టుకునే హక్కు ఉందని ప్రజాస్వామ్య బద్ధంగానే టిఆర్ఎస్ పార్టీ వ్యవహరిస్తుందని భవిష్యత్తులో కూడా ప్రజాస్వామ్యబద్ధంగానే పోరాడుతుందని వారు తెలిపారు ఇలాంటి కుట్రను ప్రజా ఉద్యమాల ద్వారా తిప్పి కొడతామని టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మేక లలిత యాదవ్ గోగికర నవీన్ భవాని వేముల హెచ్చరించారు ఈ సందర్భంగా పాల్గొన్నవారు వరికుప్పల సుధాకర్ యాదవరపు రమాదేవి దికొండ కవిత గోపు సదానందం సంపత్ రావు గౌతమ్ రెడ్డి వంశీ జయంత్ యాదవ్ సాయికుమార్ కొప్పుల అర్జున్ తదితరులు పాల్గొన్నారు




# పినపాకలో సంక్షేమం–అభివృద్ధి సందడి..

- - ఒకే రోజు నాలుగు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాయం..
- - ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు..
- - కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..
- - ప్రతిభావంతులకు సన్మానం.. బాధితురాలి పరామర్శ



**మణుగూరు/అశ్వాపురం, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో శనివారం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో సందడి నెలకొంది. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అశ్వాపురం మండలంలోని ఆనందపురం గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించగా, ఇటీవల మోకాలి శస్త్రచికిత్స చేయించుకున్న మహిళను పరామర్శించారు.

**ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు..**

అశ్వాపురం మండలం ఆనందపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన నూతన గృహాల్లో నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. లబ్ధిదారులు చింతలపూడి సుకన్య, గన్నారపు రాజేశ్వరి, సోడే సుభద్ర, పోడియం కుమారి, నాగుల నాగలక్ష్మి, మన్నెం సత్యవాణి కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**38 మందికి రూ.38.42 లక్షల కల్యాణలక్ష్మి చెక్కులు..**

అశ్వాపురం రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో 38 మంది లబ్ధిదారులకు రూ.38,42,408 విలువైన కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఈ పథకం ఆర్థిక భరోసాగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

**- ప్రతిభకు ప్రోత్సాహం..**

ఆనందపురం గ్రామానికి చెందిన ఆశ భవన్ తేజ్ ఇంటర్మీడియట్‌లో 970 మార్కులు, అతని సోదరి పదో తరగతిలో 555 మార్కులు సాధించడంతో ఎమ్మెల్యే వారిని ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే సామర్థ్యం కలిగి ఉన్నారని అన్నారు.

**శస్త్రచికిత్స అనంతరం పరామర్శ..**

ఇటీవల మోకాలి శస్త్రచికిత్స చేయించుకున్న లంకమల్ల జయప్రదను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వారి నివాసంలో పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ ముత్యాలరావు, ఎంఆర్ఓ సూర్యప్రకాష్, హౌసింగ్ ఏఈ ఉదయ్ కుమార్, సెక్రటరీ వేణుప్రియ, జీపీవో చిరంజీవి, ఎంఫీపీ సూపరింటెండెంట్ పిచ్చేశ్వరరావు, ఆర్ఐ లీలావతి, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, ఊసా అనిల్ కుమార్, తుక్కాని మధుసూదన్ రెడ్డి, వేములపల్లి రమేష్, సోడే వెంకటేశ్వర్లు, ఆవుల రవి, తెల్లం వీరభద్రం, ఎం.డి. షార్ఫుద్దీన్, తూము వీరరాఘవులు, బరాజు సంపత్, చెంచల రాము, కందుల లక్ష్మణ్, బెల్లి వెంకన్న, వేముల విజయ్, నూకల సంపత్, పర్సబోయిన సోమలింగం, రావుల వీరభద్రం, బట్టి వెంకన్న, బాలిన నరేష్, పయ్యావుల శ్రీను, తునికేసి శ్రీనివాసరెడ్డి, రావులపల్లి నరసింహారావు, కుర్రం పిచ్చయ్య, బెల్లి పురుషోత్తం, వంగూరి మధు, కుర్రం నరసింహారావు, పొడియం రమేష్, సోడే రాజు, కడారి సీతారాములు, రావులపెంట శ్రీను, వల్లపు వెంకన్న, మందటి రాంబాబు, మురికిపూడి వెంకటేశ్వర్లు, సర్పంచులు సబ్కా పిచ్చయ్య, మచ్చా నరసింహారావు, కోర్సా కృష్ణ, ఇర్పా కవిత, జిమ్మా ఝాన్సీ, కుంజా జాను, మూలమ్మ, లంకమల్ల కొండలరావు, కోలా శశికాంత్, షారుక్ పాషా తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలు

**యాదాద్రి భువనగిరి జూన్ 6 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని బీర్ల నిలయం వద్ద శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు . ఉదయం నుంచే అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో హాజరై జన్మదిన వేడుకలను ఉత్సాహభరితంగా జరిపారు. జన్మదిన సందర్భంగా బీర్ల అయిలయ్య ఉదయం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు తర్వాత యాదగిరిగుట్ట పట్టణంలోని బీర్ల నిలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో భాగంగా, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు బీర్ల అయిలయ్యకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులకు నిత్యావసర ఆహార సరుకులను పంపిణీ చేశారు. అనంతరం రాష్ట్ర, ఆలేరు నియోజకవర్గం, నలుమూలల నుండి భారీ సంఖ్యలో తరలివచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో జన్మదిన వేడుకలు అట్టహాసంగా కొనసాగాయి. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ క్రేన్ గజమాలతో బీర్ల అయిలయ్య ను ఘనంగా సత్కరించారు. సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా, పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అదేవిధంగా విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేసి వారి విద్యాభివృద్ధికి తన సహకారాన్ని తెలియజేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు బీర్ల నిలయం వద్ద అభిమానులు, ప్రజలు, కార్యకర్తల రాకపోకలతో ప్రాంతం జనసంద్రంగా మారింది. జన్మదిన వేడుకలు ఆనందోత్సాహాల మధ్య వైభవంగా సాగాయి. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ , మహిళా కమిషన్ చైర్‌పర్సన్ బంద్రు శోభారాణి , అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు , జాయింట్ కలెక్టర్ వెంకారెడ్డి , ఆర్డీవో కృష్ణారెడ్డి , వివిధ మండలాల సర్పంచులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలల్లో అతిగతి లేని క్రీడలు, వ్యాసరచన పోటీలు..!?

- కానరాని దూరంలో స్కౌట్, ఎన్‌సీసీ విభాగాలు
- ప్రశ్నార్థకంగా సంబంధిత ప్రభుత్వ అధికారులు పర్యవేక్షణ



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా ప్రైవేటు పాఠశాలల్లో క్రీడలు, వ్యాసరచన పోటీలు, స్కౌట్, ఎన్‌సీసీ విభాగాలు..!? నిర్వహణ అతి గతి లేని పరిస్థితి నెలకొంది. ప్రతి పాఠశాలలో క్రీడా మైదానం, స్కౌటు, ఎన్సిసి శిక్షణ, వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలు మండల స్థాయి నుండి జిల్లా వరకు నిర్వహించవలసిన అవసరం ఉంది. తద్వారా విద్యార్థులు పై చదువులు నిమిత్తం వాటి అవసరం ఎంతగానో ఉంటుంది. ఇంకా చెప్పాలి అంటే ఉద్యోగ నియామకాల్లో ఆయా ధృవపత్రాలను జత చేస్తే రిజర్వేషన్ కూడా అమలయే అవకాశాలు ఉన్నాయి. కానీ ప్రైవేటు విద్యాలయాల యాజమాన్యాలు కేవలం పాఠ్యపుస్తకాలను బట్టి పట్టి మార్కులు కొట్టేయడానికి మాత్రమే పోటీకి సిద్ధమవుతున్నాయి. చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలు, స్కౌట్, ఎన్‌సీసీ వంటి సహపాఠ్య కార్యక్రమాలు విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి పునాదులు చేయవలసిన అవసరం ఉంది. కానీ నేడు జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో ఇవి పూర్తిగా కనుమరుగు అయ్యాయని చెప్పవచ్చు.

పలు విద్యాసంస్థలు మార్కుల వేటలో పడడం ద్వారా క్రీడా మైదానాలు నేడు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వ్యాసరచన, వక్తృత్వ పోటీల ఊసే లేదు. ఒకప్పుడు పాఠశాలలో స్కౌట్, ఎన్‌సీసీ విభాగాలు ఉండేవని రాబోయే కాలంలో చరిత్రలో మాత్రమే చదువుకోవాల్సిన దుస్థితి దాపురించిందని పరిశీలకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మార్కులే పరమావధి... క్రీడలకు మంగళం**

మా విద్యాసంస్థలో 100 శాతం రిజల్ట్ రావడమే కాకుండా స్టేట్ ర్యాంకులు మాకే వచ్చాయంటూ పెద్ద పెద్ద హోర్డింగ్‌లు పెట్టుకుని విద్యార్థుల తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి ఉచ్చులోకి లాగుతున్నారు.

ప్రైవేటు యాజమాన్యాలకు విద్యార్థి మార్కులే తప్ప ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం ఊసు పట్టడం లేదు. ఉదయం 7 నుంచి రాత్రి 8 వరకు క్లాసులు, స్టడీ అవర్స్ పేరుతో పిల్లలను పుస్తకాలకు కట్టేస్తున్నారని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ పాఠశాల ఆవరణలో ప్లే గ్రౌండ్ ఉన్నా అది కేవలం అలంకారప్రాయమేనని వదంతులు వినిపిస్తున్నాయి. పీఈటీ అంటే ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ కాదు, పేపర్ ఎగ్జామ్ టీచర్ అయ్యాడని విద్యార్థి సంఘాల నేతలు వ్యంగ్యంగా అంటున్నారు.

**చరిత్ర పుటల్లోకి...స్కౌట్, ఎన్‌సీసీ**

ఒకప్పుడు ప్రతి పాఠశాలలో అత్యధికంగా స్కౌట్, గైడ్, ఎన్‌సీసీ యూనిట్లు ఉండేవి. క్యాంపులు, ట్రెక్కింగ్, సేవా కార్యక్రమాలతో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందేవి. అన్నింటికంటే ముఖ్యంగా పై చదువుల ప్రవేశాల్లో, పోలీస్, ఆర్మీ ఉద్యోగాల నియామకాల్లో ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ ఉన్నవారికి, స్కౌట్ రాజ్య పురస్కార్ పొందిన వారికి రిజర్వేషన్, ప్రత్యేక వెయిటేజీ ఉండేది. కానీ నేడు ప్రైవేటు స్కూళ్లలో ఈ విభాగాలను పూర్తిగా ఎత్తేశారు. ఎన్‌సీసీ అంటే ఏంటి సార్..? అని పదో తరగతి విద్యార్థి అడగడం ప్రస్తుత దుస్థితికి అద్దం పడుతోంది.

**వ్యాసరచన, వక్తృత్వం - మచ్చుకైనా కానరావడం లేదు**

గత పది సంవత్సరాల క్రితం తెలుగు భాషా దినోత్సవం, సైన్స్ డే, గణిత దినోత్సవం వంటి సందర్భాల్లో గతంలో వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలను ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలు నిర్వహించేవి. దీంతో పిల్లల్లో సృజనాత్మకత, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెరిగేవి. కానీ ఇప్పుడు ఆ టైమ్‌లో ఒక ఎక్స్‌ట్రా క్లాస్ చెబితే రెండు మార్కులు వస్తాయని యాజమాన్యాలు అన్ని పోటీలకు స్వస్తి పలికారని విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి.

**ప్రశ్నార్థకంగా సంబంధిత ప్రభుత్వ అధికారులు పర్యవేక్షణ**

ప్రైవేటు పాఠశాలల్లో క్రీడా మైదానం తప్పనిసరి, పీఈటీ ఉపాధ్యాయుడు ఉండాలి. అలాగే స్కౌట్/ఎన్‌సీసీ యూనిట్ శిక్షణలకు కూడా ఉపాధ్యాయులు ఉండవలసి ఉందని విద్యాహక్కు చట్టం చెబుతోంది. కానీ వీటిని పర్యవేక్షించాల్సిన జిల్లా విద్యాశాఖ, జిల్లా క్రీడా అధికారులు పట్టించుకోవడం లేదు. పాఠశాల రెన్యువల్ సమయంలో ఆయా ధృవపత్రాలలో అన్నీ ఉన్నట్టు ప్రైవేటు విద్యాలయాళ యజమానులు చూపిస్తారు. క్షేత్రస్థాయిలో సంబంధిత ప్రభుత్వాధికారుల తనిఖీలు నిర్వహించకుండా ఆయా అధికారులను కట్టడి చేస్తారని

కొంతమంది ప్రైవేటు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం స్కౌట్ మాస్టర్, ఎన్‌సీసీ ఆఫీసర్ పోస్టులకు యాజమాన్యాలు జీతాలు ఇవ్వలేక ఆ విభాగాలను పూర్తిగా మూసేశాయి.

**నష్టపోతున్నది విద్యార్థులే**

కనీసం సంవత్సరానికి ఒకసారి కూడా క్రీడలు లేకపోవడంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు తెలుస్తోంది. దీనితో 15 సంవత్సరాలు లోపు పిల్లలకు ఊబకాయం, కంటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలుస్తోంది. స్కౌట్, ఎన్‌సీసీ లేకపోవడంతో సైనిక, పోలీస్ ఉద్యోగాల్లో వచ్చే 5 శాతం నుంచి 10 శాతం రిజర్వేషన్ విద్యార్థులు కోల్పోతున్నారు.

## గ్రామస్తుల ప్రతిజ్ఞ

**నిర్మల్, మహా:** నిర్మల్ జిల్లా లక్ష్మణ్ చాందా మండలంలోని బాబాపూర్ గ్రామస్తులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు మాత్రమే పంపిస్తామని ప్రతిజ్ఞ చేసి ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామ సర్పంచ్ పడిగెల లక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు సుజాత ఆధ్వర్యంలో గ్రామస్తులందరూ ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల పలువురు ఆ గ్రామస్తులను అభినందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

## గ్రామ సభలతో సమస్యల పరిష్కారం.. అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**రాజేంద్రనగర్, మహా:** ప్రజా పాలనా ప్రగతి నివేదిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల వేగవంతం లక్ష్యంగా శనివారం కవ్వగూడ, పెద్దతుప్ర తండాww, పెద్దషాపూర్, అలికోల్ తండా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలకు జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ హాజరై గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని నర్సరీలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులను సందర్శించిన ఆయన గ్రామాల పరిశుభ్రత, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల అభివృద్ధిలో గ్రామ సభలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంటూ ప్రజల భాగస్వామ్యంతో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గ్రామ సభల్లో వర్షాకాల సన్నద్ధత, సురక్షిత తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ, మొక్కల పెంపకం-వన మహోత్సవం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, వరద నిర్వహణ-భద్రత చర్యలు వంటి ఏడు కీలక అంశాలపై ప్రత్యేకంగా చర్చించి ఆయా అంశాలపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో మున్ని, మండల పంచాయతీ అధికారి రమేష్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వార్డ్ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# భవిష్యత్ భారత్ బాలలదే

- బాల్యం బడులకు అంకితం
- బాల పంచాయత్ కార్యక్రమంలో ఎస్పీ సూచనలు

**ఆదిలాబాద్ మహా :** భవిష్యత్ భారతదేశం బాలలదే అని బాల్యం పనులకు కాకుండా బడులకు అంకితం కావాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం తాంసి మండలం కప్పర్ల గ్రామంలో నిర్వహించిన బాల పంచాయత్ కార్యక్రమంలో ఆయన అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్ తో కలిసి పాల్గొన్నారు. బాల కార్మికులు, వ్యభిచార గృహాలు, భిక్షాటన, బాల్య వివాహాలు, పిల్లల అక్రమ రవాణా వంటి సామాజిక సమస్యలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. బాల పంచాయత్ ద్వారా పిల్లల సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. పిల్లలను చదువుకు దగ్గర చేయడం, విద్య యొక్క ప్రాధాన్యతను గుర్తించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా బాలికల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాలల్లో వేధింపులు, వివక్షకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల బాలికలను సమానంగా చూడాలని, బాలికల పట్ల వివక్ష చూపకూడదని తెలిపారు. గ్రామాల్లో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటు చేసి బాలల సంక్షేమం, భద్రతపై నిరంతర సమీక్ష నిర్వహించాలని తెలిపారు. ఇళ్లలో, పాఠశాలల్లో చైల్డ్ ఫ్రెండ్లీ విధానాలను అమలు చేయాలని, సమస్యలను నిర్భయంగా తెలియజేసిన విద్యార్థులను అభినందించారు. సమస్యల పరిష్కారంతో పాటు భవిష్యత్తులో సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. బాల బాలికలకు సమాన విద్యా అవకాశాలు కల్పించాలని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో బాల్య వివాహాల నివారణకు ప్రత్యేక తీర్మానాలు చేపట్టాలని, తల్లిదండ్రులు గంజాయి, గుట్కా వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా కుటుంబ సభ్యులను పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు బాల్య వివాహాలు, సోషల్ మీడియా వినియోగంపై అప్రమత్తత, చెడు అలవాట్లు, ఉపాధి అవకాశాలు, చదువు పట్ల ఆసక్తి, తల్లిదండ్రుల మధ్య సమస్యలు పిల్లలపై చూపుతున్న ప్రభావం, క్రీడల ప్రాధాన్యత, గ్రామంలో మరుగుదొడ్ల సమస్యలు తదితర అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి. మౌనిక , డీఈవో మాధవి, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, డిసిపిఓ రాజేంద్ర ప్రసాద్, ష్యూర్ ఎన్జీవో కోఆర్డినేటర్ వినోద్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, ఉమెన్ సేఫ్టీ వింగ్ సీఐ దాసు, కపర్ల సర్పంచ్ అరుణ్, ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా, తాంసి ఎస్ఐ ఎస్. జీవన్ రెడ్డి, గ్రామ పెద్దలు, అధికారులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామాలుగా నిలవాలి

- గ్రామ సభలలో కలెక్టర్ ఆకాంక్ష
- పల్లి (బి) లో దరఖాస్తుల స్వీకరణ
- అధికారులకు పలు సూచనలు



**ఆదిలాబాద్ మహా :** జిల్లాలోనే పల్లి(బి) గ్రామం ఆదర్శ గ్రామంగా నిలవాలని, జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన ప్రగతిప్రణాళిక లో భాగంగా తలమడుగు మండలం పల్లి(బి) గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు వివరాలను గ్రామసభలో వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి తక్షణ పరిష్కారానికి క్షేత్రస్థాయిలోనే అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి సంరక్షణ, వ్యవసాయ ప్రణాళికలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున, రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సాగు దిగుబడి పెంచే ట్రైకోడెర్మా వంటి పద్ధతులు పాటించాలని కోరారు. గ్రామాల్లో మహిళా భద్రత, సురక్షిత ప్రయాణాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదర్శవంతమైన గ్రామాలుగా నిలవాలంటే యువత మత్తు పదార్థాలు, గంజాయి, ప్రాణాంతక క్యాన్సర్లకు దారితీసే తంబాకు, జర్దా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, వాటికయ్యే ఖర్చును పౌష్టికాహారం, ఆరోగ్యం కోసం ఉపయోగించుకోవాలని హితవు పలికారు. గ్రామ అభివృద్ధి పనులైన మిషన్ భగీరథ పైప్‌లైన్ విస్తరణ, సిసి రోడ్లు, వైకుంఠ ధామాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి సంబంధించిన అంచనాలను పరిశీలించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, నవంబర్ చివరి నాటికి 'గ్రామ సంఘం భవనం' నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, 'మన ఊరు మన బడి' కింద పెండింగ్‌లో ఉన్న నిధులను త్వరలోనే విడుదల చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం, సైన్స్ సబ్జెక్టులలో నాణ్యమైన విద్యనందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో భాగంగా 'దాజుగా' స్కీమ్ కింద అర్హులైన ప్రతి ఎస్టీ (ST) కుటుంబానికి ఉచితంగా కరెంట్ మీటర్లు అందించాలని, గ్రామాల్లో వంగిపోయిన, తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలను, లూజ్ లైన్లను యుద్ధప్రాతిపదికన సరిచేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రతి బోర్ వెల్‌తో పాటు ఒక రీఛార్జ్ స్ట్రక్చర్‌ను తప్పనిసరిగా నిర్మించుకోవాలని గ్రామసభలో కలెక్టర్ సమక్షంలో తీర్మానం చేశారు. ఈ గ్రామ సభ లో తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీవో శంకర్, సర్పంచ్ కట్కం సంజీవ్, పంచాయతీ కార్యదర్శి బాలాజీ, మండల విద్యా, వైద్య, వ్యవసాయ, విద్యుత్, గృహ నిర్మాణ, పంచాయతీ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.




## దేవ్‌జీని పరామర్శించిన కల్వకుంట్ల కవిత

కుషాయిగూడ, మహా: మావోయిస్ట్ మాజీ నేత తిప్పిరి తిరుపతి (దేవ్‌జీ)ని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత శనివారం పరామర్శించారు. అనారోగ్యంతో కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దేవ్‌జీని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించిన కవిత, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా దేవ్‌జీ కుటుంబ సభ్యులు, పార్టీ నేతలు కూడా పాల్గొన్నారు.a

# కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరంపై ఎస్ఓటి పోలీసుల దాడులు..

**రాజేంద్రనగర్ మహా ;** రంగా రెడ్డి జిల్లా శంషాబాద్ శివారులోని బుర్జు గడ్డ తండాలో గుట్టుచప్పుడు కాకుండా కోడిపందాలను నిర్వహిస్తున్నా, స్థావరంపై ఎస్ఓటీ పోలీసులు శనివారం దాడిలు నిర్వహించారు. బుర్జుగడ్డ తండా శివారులో అక్రమంగా సాగుతున్న కోడి పందాలు కాస్తున్న ఎనిమిది మందిని 1) హరికృష్ణ,2) కే వర్మ, 3) వంశీకృష్ణరాజు,4) పాల్కం రమేష్ బాబు,5) సోమరాజు, 6) భరత్ ,7) సంజీయ్ రెడ్డి, 8) కట్టా దుర్గాప్రసాద్, ఎనిమిది మందిని షాద్‌నగర్, శంషాబాద్ ఎస్వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ9,920 రూపాయల నగదు, కోళ్లు 11, విలువ ,16500, పందాలకు ఉపయోగిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ కోడిపందాల నిర్వహణను పర్యవేక్షిస్తున్న ప్రధాన



నిర్వాహకుడు పెద్ద షాపూర్ గ్రామానికి సంబంధించిన సూపర్వైజర్ నందు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయు. అక్రమ జూద కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ ఓటి పోలీసులు హెచ్చరించారు.

# అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అదనపు కలెక్టర్

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను మంచిర్యాల జిల్లా కలెక్టర్ చంద్రయ్య తో పాటు మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు లు క్షేత్రస్థాయిలో శనివారం నాడు పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు ఈ సందర్భంగా అదన కలెక్టర్ చంద్రయ్య మాట్లాడుతూ అమృత్సర్ 2. 0 పథకం కింద పట్టణానికి మంజూరైన శుభ్రమైన నీటిని అందించే ప్రక్రియలో భాగంగా చేపడుతున్న నిర్మాణ పనులను పరిశీలించి పనులు త్వరగతిన నాలుగు నెలల్లో పూర్తిచేసి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం రైల్వే స్టేషన్ సమీపంలో చేపడుతున్న ఫిల్టర్ బెడ్ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. ఆ తర్వాత నడగంబాల బస్సులో జాతికుంట చెరువు నిర్మాణ పనులను మరియు సుందరీకరణ చెరువు సుందరి కన్నా పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అదేవిధంగా జాతికుండ చెరువు నిర్మాణ అక్రమ నిర్మాణాల చెరువు పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న అక్ర కట్టడి చేయాలని అందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించుకోవాలని, చెరువు ఆక్రమణలకు గురికాకుండా చెరువు చుట్టూ పనులు కందకము తవ్వి కట్టను ఏర్పాటు



చేసి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన..

**రాజేంద్రనగర్ మహా ;** ప్రభుత్వ పాఠశాలలకు బలమైన పునాది వేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. మండల విద్యాధికారి ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన ప్రాథమిక విద్య అందించేందుకు 202627 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 2,769 కొత్త ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలాస్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. శంషాబాద్ మండల పరిధిలోని మండల ప్రాథమిక పాఠశాల సాతంరాయి,మండల ప్రాథమిక పాఠశాల, శంషాబాద్ సర్కిల్ ప్రాథమికోన్నత పాఠశాల చిన్నగొల్లపల్లి పాఠశాలలో ప్రీప్రైమరీ స్కూల్ టీచర్లు (ఇన్‌స్ట్రక్టర్లు), ఆయాల నియామకాలు చేపట్టారు. చిన్న వయసు నుంచే ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచడంతో పాటు పేద మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ తెలిపారు. ప్రీ ప్రైమరీ టీచర్ పోస్టులకు ఇంటర్మీడియట్ తో పాటు డీఈడీ లేదా ప్రీప్రైమరీ టీచర్ ట్రైనింగ్



సర్టిఫికెట్ ఉండాలి. ఆయాలకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలి. ప్రీ ప్రైమరీ టీచర్లకు నెలకు 8 వేలు,ఆయాలకు 6వేలు గౌరవ వేతనం ఉంటుందని,ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక పద్ధతిలో ఉంటాయని స్థానికులకు ప్రాధాన్యత ఉంటుందని, ఈ సందర్భంగా తెలిపారు. ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టులకు అర్హతలు కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు సోమవారం సాయంత్రం వరకు శంషాబాద్ మండల విద్యాశాఖ కార్యాలయంలో ఇవ్వాలన్నారు.



## సింగ్ గీతం చేయడం నా అదృష్టం: దేవిశ్రీ ప్రసాద్



''సింగీతం శ్రీనివాసరావుగారు చేసినన్ని ప్రయోగాలు ఎవ్వరూ చేసి ఉండరు. 'సింగ్ గీతం' ప్రాజెక్ట్ చేస్తున్నామని మూడేళ్ల క్రితం ఆయన చెప్పినప్పుడు హ్యాపీ అనిపించింది. నాగ్ అశ్విన్‌గారు, స్వప్నగారు, వైజయంతి మూవీస్‌తో కలిసి ఈ సినిమా రూపొందడం మరింత ఆనందాన్నిచ్చింది. ఈ సినిమా చేయడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను'' అని దేవిశ్రీ ప్రసాద్ తెలిపారు. ఆయాన్, అహల్యా బమ్రూ జంటగా శాలిని కొండెపూడి కీలక పాత్ర పోషించిన చిత్రం 'సింగ్ గీతం'. ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో వైజయంతి మూవీస్, స్వప్న సినిమాస్‌పై నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.నేను సింగీతంగారికి వీరాభిమానిని. మా నాన్న సత్యమూర్తిగారిని కలవడానికి వచ్చినప్పుడు వాళ్లు మాట్లాడుకుంటుంటే నేను ఆరాధనగా చూసేవాడిని. అలాంటిది సింగీతంగారితో కలిసి పని చేయడం ఒక ఆశీర్వాదంగా అనిపించింది. సింగీతం గారు ఎప్పుడూ ట్రెండ్‌కి తగ్గట్టు కథలు ఆలోచించలేదు. ఆయనకు ఒక ఆలోచన వచ్చిందంటే అది ఇంతకు ముందు రానిది, తర్వాత కూడా రానిదిగా ఉంటుంది. 'పుష్పక విమానం' ఇప్పటికీ చాలా అడ్వాన్స్డ్ మూవీ. 'సింగ్ గీతం' ఐడియా కూడా అంతే కొత్తగా ఉంటుంది. ఒక గ్రామం మొత్తం మాట్లాడలేక కేవలం పాటల రూపంలోనే సంభాషించే కథ ఇప్పటివరకు రాలేదు. అది 'సింగ్ గీతం'లో కొత్తగా ఉంటుంది. నా కెరీర్‌లో సవాల్‌తో కూడుకున్న సినిమా ఇది. ఇది కేవలం కామెడీ సినిమా కాదు... అద్భుతమైన భావోద్వేగాలు కూడా ఉన్నాయి. కమల్‌హాసన్‌గారు సినిమా చూసి, 'ఇలాంటి సినిమాలో నేను కూడా భాగం కావాల్సింది' అనడం మాకు ఆనందాన్నిచ్చింది. చిన్నప్పటి నుంచి ప్రతి అక్షరాన్ని సంగీతంగా మార్చే అలవాటు నాకుండేది. అప్పుడు న్యూస్‌పేపర్ తీసుకుని అందులో ఉన్న వార్తలనే ట్యూన్స్‌గా మార్చుకునేవాడిని. అది 'సింగ్ గీతం'కి ఉపయోగపడింది. ఈ సినిమా కోసం ప్రతిదీ ముందుగానే మ్యూజికల్‌గా చేసి ఇచ్చాం. తర్వాత షూట్ చేశారు. ఈ సినిమాలో నటించిన ప్రతి ఒక్కరూ పాడగలిగారు. 94 ఏళ్ల వయసులోనూ కొత్త ఆలోచనతో, ఉత్సాహంగా సినిమా చేసిన సింగీతం గారి నుంచి ప్రేక్షకులు స్ఫూర్తి పొందుతారు.

### హిట్ బ్యూటీ కొత్త సినిమా..
## ఓటీటీ స్ట్రీమింగ్ ఎప్పుడంటే?



ఓటీటీల్లోకి ఎప్పటికప్పుడు కొత్త సినిమాలు వస్తూనే ఉంటాయి. మరీ ముఖ్యంగా మలయాళ చిత్రాలకు తెలుగునాట చాలా క్రేజ్ ఉంటుంది. ఆ భాషలో తీసిన వివిధ జానర్ల మూవీస్‌ని తెలుగు ఆడియెన్స్ ఆదరిస్తుంటారు. అందుకు తగ్గట్లే డబ్బింగ్ చేసి మరీ రిలీజ్ చేస్తుంటారు. ఇప్పుడు కూడా గత నెలలో రిలీజై హిట్టయిన కామెడీ సినిమా ఇప్పుడు స్ట్రీమింగ్‌కి సిద్ధమైంది. ఈ మేరకు అధికారికంగానూ ప్రకటించారు. మలయాళంలో హీరో, దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న బాసిల్ జోసెఫ్ లేటెస్ట్ యూత్‌ఫుల్ కామెడీ మూవీ 'అతిరథి'. ఇందులోనే టొవిన్ థామస్ మరో హీరోగా నటించాడు. 'సర్వం మాయ' ఫేమ్ రియా షిబు హీరోయిన్‌గా చేసింది. గత నెల 14న థియేటర్లలో రిలీజై ఆకట్టుకుంది. రూ.65 కోట్ల మేర కలెక్షన్స్ కూడా వచ్చాయి. ఇప్పుడీ మూవీ ఈ నెల 19వ తేదీ నుంచి సోనీ లివ్‌లో అందుబాటులోకి రానుంది. తెలుగులోనూ స్ట్రీమింగ్ కానుందని పోస్టర్‌తో క్లారిటీ ఇచ్చారు. 'అతిరథి' విషయానికొస్తే.. ఇంజినీరింగ్ చదివే సామ్ కుట్టి(బాసిల్ జోసెఫ్) తన కాలేజీలో ఆగిపోయిన అరోహన్ ఫెస్ట్‌ని తిరిగి ప్రారంభించాలని అనుకుంటాడు. కానీ ఇదే కాలేజీలో ఉంటే మరో గ్రూప్ దీన్ని వ్యతిరేకిస్తుంది. మరి చివరకు ఏమైంది? సామ్ కుట్టి తను అనుకున్నది సాధించాడా లేదా? శ్రీకుట్టి(టొవినో థామస్), స్వాతి (రియా షిబు) ఎవరు? అనేది మిగతా స్టోరీ. కాలేజీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కామెడీ సినిమా చూద్దామనుకుంటే దీన్ని ట్రై చేయొచ్చు.

### సుడిగాలి సుధీర్‌కి జోడీగా
## బిగ్ బాస్ బ్యూటీ






సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'సుధీర్స్ జోకర్'. బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్ గా పరిచయం కాబోతోంది. ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని విజయ్ దొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రోజు హీరోయిన్ అయేషా పుట్టినరోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. 'సుధీర్స్ జోకర్' చిత్రంలో ఆమె షాలినీ అనే క్యారెక్టర్ లో తన అందంతో పాటు పర్ ఫార్మెన్స్ తో ప్రేక్షకుల్ని అలరించబోతోంది. రీసెంట్ గా హీరో సుడిగాలి సుధీర్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన 'సుధీర్స్ జోకర్' మూవీ బ్యాంగర్ కు హ్యూజ్ రెస్పాన్స్ దక్కింది. ఒక ఇంట్రెస్టింగ్ కమర్షియల్ ఎంటర్ టైనర్ చూడబోతున్నామనే ఎక్స్ పెక్టేషన్స్ ఈ మూవీపై ఏర్పడుతున్నాయి.

## రాముడు వర్సెస్ కుంభకర్ణుడు

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న టైమ్ ట్రావెల్ అండ్ మైథలాజికల్ యాక్షన్ డ్రామా 'వారణాసి'. ఈ చిత్రంలో రుద్రగా, రాముడిగా నటిస్తున్నారు మహేశ్‌బాబు. ఈ సినిమాలో మహేశ్‌బాబు 30 నిమిషాల పాటు రాముడిగా కనిపిస్తారని ఆల్రెడీ చిత్రబృందం పేర్కొన్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఈ చిత్రం రచయితల్లో ఒకరైన వి. విజయేంద్ర ప్రసాద్ ఓ ఆసక్తికరమైన అంశాన్ని వెల్లడించారు. రాముడికి, కుంభకర్ణుడికి మధ్య యుద్ధానికి సంబంధించిన చిత్రంగా 'వారణాసి' ఉంటుందని, ఈ సీక్వెన్స్ అత్యద్భుతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ చిత్రంలో కుంభ పాత్రలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్, మందాకిని పాత్రలో ప్రియాంకా చోప్రా, శివభక్తుడు పాత్రలో ప్రకాశ్‌రాజ్ నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కేఎల్ నారాయణ, ఎస్ఎస్. కార్తికేయ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఇక ఈ 'వారణాసి' సినిమాకు వి. విజయేంద్ర ప్రసాద్, ఎస్.ఎస్. కాంచి కథ అందించగా, దర్శకుడు దేవ కట్టా సంభాషణలు రాశారు.




## పెళ్లి తర్వాత నాగచైతన్య మరో నిర్ణయం

టాలీవుడ్ సీనియర్ హీరోల్లో నాగార్జున కాస్త డిఫరెంట్. ఒకవైపు హీరో, విలన్, కీలక పాత్రలు, షో హోస్టింగ్ చేస్తూ మరోవైపు నిర్మాతగానూ అడపాదడపా సినిమాలు తీస్తుంటారు. ప్రస్తుతం తన 100వ మూవీ బిజీలో ఉన్నారు. మరోవైపు కొడుకుల్లో నాగచైతన్య 'వృషకర్మ' చిత్రం చేస్తుండగా ఇప్పుడు మరో కొత్త ప్రాజెక్టుని ప్రకటించారు. 2023లో వచ్చిన వెబ్ సిరీస్ 'దూత' రెండో సీజన్ మొదలుపెట్టేశారు. థ్రిల్లర్ కాన్సెప్ట్ తో మెప్పించిన 'దూత' సిరీస్‌లో నాగచైతన్య, ప్రియాభవానీ శంకర్, పార్వతి ప్రధాన పాత్రలు చేశారు. విక్రమ్ కే కుమార్ దర్శకుడు. మళ్లీ ఇన్నాళ్లు రెండో సీజన్ లాంఛనంగా మొదలుపెట్టారు. అయితే దీనిలో నటించడంతో పాటు నిర్మాతగానూ నాగచైతన్య వ్యవహరిస్తున్నాడు. ఈ విషయాన్ని చెబుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు.

ఏడాదిన్నర క్రితం శోభితని పెళ్లి చేసుకున్న నాగచైతన్య.. ఆ వెంటనే 'తండేల్'తో వచ్చి హిట్ కొట్టాడు. ఇప్పుడు నిర్మాతగానూ మారిపోయాడు. రాబోయే రోజుల్లో తను హీరోగా నటించే చిత్రాలతో పాటు శోభిత నటించే సినిమాలని కూడా నిర్మిస్తాడేమో! 'దూత' సిరీస్ తొలి సీజన్.. అమెజాన్ ప్రైమ్ ఓటీటీలో ఉంది. థ్రిల్లర్ కాన్సెప్ట్ ఇంట్రెస్ట్ ఉంటే చూడొచ్చు.

### విజయ్-రష్మికల రణబాలి..
## వంద రోజుల షూటింగ్ పూర్తి!

వంద రోజుల షూటింగ్ పూర్తి చేసుకున్న రణబాలి




విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా 'రణబాలి' సినిమా రూపొందుతోంది. తాజాగా 'రణబాలి' సినిమా సక్సెస్ ఫుల్ గా వంద రోజుల షూటింగ్ పూర్తి చేసుకుంది. ఇటీవలే గండికోటలో షెడ్యూల్ చిత్రీకరణ జరిపారు. వారం రోజుల పాటు సాగిన ఈ షెడ్యూల్ లో విజయ్ దేవరకొండ, రష్మిక మధ్య వచ్చే ఎమోషనల్ సీన్స్ రూపొందించారు. ఇప్పటిదాకా ఈ చిత్రానికి సంబంధించిన 90 పర్సెంట్ షూటింగ్ కంప్లీట్ అయ్యింది. ఔట్ పుట్ పూర్తి సంతృప్తికరంగా వచ్చిందని మేకర్స్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. రీసెంట్ గా విజయ్ దేవరకొండ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన గ్లింప్స్ లోని ఎలక్ట్రిఫైయింగ్ యాక్షన్ సీక్వెన్సులు మూవీ లవర్స్ ను బాగా ఆకట్టుకున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఉన్న 'రణబాలి' సినిమా సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ రిలీజ్ కు అన్ని సన్నాహాలు శరవేగంగా జరుగుతున్నాయి.

### ఎవరినీ ప్రేమించలేదు..
## పెళ్లి ఆలోచన ఇప్పుడు లేదు: హీరోయిన్



ఈ తరం హీరోయిన్ల ఆలోచనా ధోరణియే వేరు. తమకంటూ ప్రత్యేక గుర్తింపు కోసం పోరాడుతున్నారనే చెప్పాలి. ప్రేమ, పెళ్లి విషయం ఎత్తితేనే అందుకు చాలా సమయం ఉందంటున్నారు. యంగ్ హీరోయిన్ నికిలావిమల్ ఇలాంటి అభిప్రాయానే వ్యక్తం చేస్తున్నారు. మలయాళంలో బాల నటిగా పలు చిత్రాల్లో నటించిన ఈ భామ ఆ తరువాత తమిళం, తెలుగు భాషల్లో కథానాయికిగా నటిస్తూ తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకోవడానికి శ్రమిస్తున్నారు. తమిళంలో వెట్రివేల్, కిడారి, పంచుమిట్టాయి, తంబి, పోర్ తొళిల్ వంటి చిత్రాల్లో నటించారు. ఇటీవల మారి సెల్వరాజ్ దర్శకత్వంలో రూపొందిన వాళై చిత్రంలో నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. తమిళం తెలుగు, మలయాళం భాషల్లో నటిస్తున్న నికిలా విమల్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ప్రేమ, పెళ్లి గురించి మాట్లాడుతూ తన మనసులో ఇప్పటివరకూ ఎవరూ లేరని, తానెవరినీ ప్రేమించడం లేదని తెలిపారు. పెళ్లి గురించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు అన్నారు. ప్రేమ, పెళ్లి వంటివి పెద్ద విషయం కాదు అని, అలాంటి ఆలోచన వచ్చినప్పుడు చూసుకో వచ్చునని అన్నారు. ఇప్పుడు తన ఆలోచనలు అంతా సినిమా చుట్టూనే అని నికిలా విమల్ చెప్పారు.



### అందాలతో గత్తరలేపుతున్న ప్రగ్యా పాప..
## చూపులతో కిక్కేస్తుందిగా..

ప్రగ్యా జైస్వాల్.. కంచె సినిమాతో తెలుగు ఆడియన్స్ మనసు దోచుకున్న హీరోయిన్. ఆ తర్వాత కూడా కొన్ని సినిమాలు చేసింది కానీ ఒక్కటి కూడా సక్సెస్ కాలేదు. ప్రగ్యా పర్సనల్ విషయానికి వస్తే.. 1991 జనవరి 12న జన్మించిన ఈమె ముందుగా కొన్ని యాడ్ ఫిల్మ్‌స్‌లో నటించింది. ప్రగ్యా జైస్వాల్ పూణెలోని సింబైసిస్ లా స్కూల్‌లో చదువుకుంది.కాలేజీలో అందాల పోటీల్లో పాల్గొని అక్కడ కూడా సత్తా చాటింది. 2014లో తెలుగు, తమిళ్ బై లింగ్వల్ 'విరాట్టు/డేగ' సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. తెలుగులో 2015లో క్రిష్ దర్శకత్వంలో తెరకెక్కిన వరుణ్ తేజ్ హీరోగా తెరకెక్కిన 'కంచె' సినిమాతో పరిచయమైంది. తొలి సినిమాతోనే బెస్ట్ ఫీమేల్ డెబ్యూ అవార్డు కైవసం చేసుకుంది.హిందీలో టిటూ MBA సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఇక ఈమె తెలుగులో కంచె తర్వాత చేసిన 'నక్షత్రం' (2017), మంచు విష్ణుతో చేసిన 'ఆచారి అమెరికా యాత్ర' సినిమాలు ఈమెకు సక్సెస్ ఇవ్వలేకపోయాయి. గత ఏడాది వచ్చిన 'డాకు మహారాజు' సినిమాలోనూ, అలాగే రీసెంట్‌గా వచ్చిన 'అఖండ2'లోనూ బాలయ్య సరసన నటించి బ్యాక్ టు బ్యాక్ హిట్లను తన ఖాతాలో వేసుకుంది.ఈ మూవీల మంచి విజయం సాధించినప్పటికీ ప్రగ్యాకు టాలీవుడ్‌లో కొత్త ఆఫర్లు పెద్దగా రాలేదు. ప్రస్తుతం చేతిలో ఎలాంటి ప్రాజెక్టులు లేకపోవడంతో తన పూర్తి ఫోకస్ సోషల్ మీడియాపై పెట్టింది.

OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com